నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 27-11-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:99 పేజీలు: 4 వెల: రూ.1/-

అర్ధరాత్రి తీరం దాటిన నివర్ తుఫాన్

పుదుచ్చేరికి సమీపంలో తీరం దాటినట్లు వెల్లడి
తుఫాను ధాటికి తమిళనాడు,ఎపిలో భారీ వర్షాలు
చెన్నైలో చెట్టుకూలి ఒకరు మృతి
తిరుమలలో విరగిపడ్డ కొండచరియలు
కొనసాగుతున్న సమాయక చర్యలు

చెన్నై,నవంబర్26(ఆర్ఎన్ఎ): తమిళనాడు, పుదుచ్చేరిలను కంటిమీద కునుకులేకుండా చేస్తున్న 'నివర్' తుపాను తీరం దాటింది. పుదుచ్చేరికి సమీపంలో తీరం దాటి అతితీవ్ర తుపాను నుంచి తీవ్రతుపానుగా మారింది. బుధవారం రాత్రి 11.30 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 2.30 గంటల మధ్య నివర్ తుపాను తీరం దాటినట్లు వాతావరణ శాఖ పేర్కొంది. నివర్ తుపాన్ తమిళనాడు, పుదుచ్చేరిలపై తీవ్ర ప్రభావం చూపనుంది. తీరం దాటిన తర్వాత తీవ్ర తుపానుగా మారింది. తుపాను ధాటికి తమిళనాడులోని చెన్నై సహా కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. తమిళనాడు తీరప్రాంతాల్లో పెనుగాలులు, అతిభారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. గాలులకు భారీ చెట్లుకూడా నేలకొరిగాయి.అనేక చోట్ల విద్యుత్ స్తంబాలు కూడా పడిపోయాయి.

దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెన్నైలో చెట్లుకూలి ఒకరు మృతి చెందారు. తిరుమల ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. తమిళనాడులో ముందు జాగ్రత్తగా నాగపట్నం, విల్లుపురం, కడలూరు జిల్లాలతో పాటు మరిన్ని ప్రాంతాల నుంచి 1.45 లక్షల మందిని 1500పైగా పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి తరలించారు. చెన్నై, చెంగల్‌పేట, కడలూరుతోపాటు పుదుచ్చేరిలో నిన్న భారీ వర్షాలు కురిశాయి. చెన్నైలో బుధవారం 16సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పుదుచ్చేరిలో 10 సెంటీమీటర్లు కురిసింది. ఇవాళ



తమిళనాడులోని 16 జిల్లాల్లో ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించింది. ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.ఇప్పటికే తుపాను ప్రభావంతో తమిళనాడులోని పలు ప్రాంతాలు, ఏపీలోని నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. తుపాను తీరం దాటాక గంటకు 120-145 కి.మీల వేగంతో గాలులు వీస్తాయని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు చెన్నై సముద్ర తీర ప్రాంతాలు అల్లకల్లోలంగా మారాయి. తుపాను ప్రభావంతో చిత్తూరు, కర్నూలు, ప్రకాశం, కడప జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తున్నాయి. మిగిలిన చోట్ల అక్కడక్కడ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు ఉన్నాయి. ఇప్పటికే నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు సహాయక చర్యల కోసం 5ఎన్డీఆర్ఎఫ్, 4ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. దక్షిణ కోస్త తీరంలో గంటకు 40- 60కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయి. ఇల్లు సురక్షితం కాకపోతే పునరావాస కేంద్రాలకు ప్రజలు తరలివెళ్లాలని విపత్తల శాఖ సూచించింది. రైతులు అప్రమత్తంగా ఉండి, పంట సంరక్షణకై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ సూచించింది.నివర్ తుపాను కారణంగా తిరుమలలో భారీ వర్షం కురుస్తోంది. తీవ్రంగా వీస్తున్న గాలులకు ఎక్కడికక్కడ చెట్లు నేలకూలుతున్నాయి. తిరుమల కనుమ మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. తిరుమల వ్యాప్తంగా కుండపోతగా వర్షం కురుస్తోంది. బలమైన గాలులు వీచడంతో చెట్లు విరిగిపడుతున్నాయి.పాపవినాశనం దారిపై కూలిన వృక్షాలను అటవీ సిబ్బంది తొలగించారు. హరిణి ప్రాంతంలో రహదారిపై బండ రాళ్లు పడ్డాయి. జేసీబీల సాయంతో అధికారులు బండరాళ్లను తొలగిస్తున్నారు. పాపవినాశనం వద్ద కూలిన వృక్షాలను అటవీశాఖ సిబ్బంది తొలగిం చారు. మరోవైపు తుపాను దృష్ట్యా ఇవాళ నడవనున్న పలురైళ్లను రద్దుచేశారు. మరోవైపు తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు పడుతున్నాయి. చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నారు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

చెన్నైలో చెట్టు కూలి వ్యక్తి మృతి

నివర్ ప్రభావంతో చెట్టు విరిగిపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఒక వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా..గాలివానకు ఒక్కసారిగా చెట్టు కూలింది. దీంతో ఆ వ్యక్తి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విపత్తు నిర్వహణ సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. 1200 వందల బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఒడిశాలో మరో 20 బృందాలను సిద్ధంగా ఉంచారు. నౌకాదళం కూడా సహాయక చర్యల్లో పాల్గొంటోంది. చెన్నై తీరంలో కోస్టుగార్డులతోపాటు షిప్‌లను, హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచారు. పుదుచ్చేరి సర్కారు విజ్ఞప్తితో సైన్యం కూడా రంగంలోకి దిగింది.

మారడోనా మృతి పట్ల భారత ప్రధాని మోదీ సంతాపం

న్యూఢిల్లీ,నవంబర్26(ఆర్ఎన్ఎ): అర్జెంటీనా దేశానికి చెందిన దిగ్గజ ఫుట్‌బాల్ ప్లేయర్ డీగో మారడోనా మృతి పట్ల భారత ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. ఫుట్‌బాల్ మైదానంలో మారడోనా తన కెరీర్‌లో ఎన్నో అత్యుత్తమ క్రీడా అద్భుతాలను సృష్టించారన్నారు. మారడోనా ఆకస్మిక మరణం అందర్నీ కలిచివేసిందని ప్రధాని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఫుట్‌బాల్ ఆటలో మారడోనా ఓ జ్ఞాని అని, ప్రపంచ వ్యాప్తంగా అతనికి మంచి పాపులారిటీ ఉందన్నారు. మారడోనా ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తున్నట్లు మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

పరిధి దాటిన తీర్పులు కొన్ని కనిపిస్తున్నాయి

ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ,నవంబర్25(ఆర్ఎన్ఎ): మన దేశంలో రాజ్యాంగమే సర్వోన్నతమైనదని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో ఏదీ ఒకదానిపై మరొకటి ఉన్నతమైనదిగా చెప్పుకోకూడదని తెలిపారు. అయితే న్యాయ వ్యవస్థ తన పరిధి దాటిందనే ప్రత్యేకమైన అభిప్రాయాన్ని కొన్ని కోర్టు తీర్పులు కలిగిస్తున్నాయన్నారు. రాజ్యాంగం నిర్వచించిన పరిధులలోనే ఈ మూడు వ్యవస్థలు పని చేయాలన్నారు.

గుజరాత్‌లోని కేవడియాలో జరిగిన 80వ ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌ను ఉద్దేశించి వెంకయ్య నాయుడు బుధవారం మాట్లాడారు. ''శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య సామరస్యపూర్వక సమన్వయం ÷-ఖశక్తిమంతమైన ప్రజాస్వామ్యానికి కీలకం' అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ప్రతి విభాగం ఇతర విభాగాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా పని చేసుకోవడంలోనే సామరస్యం ఉంటుందని వెంకయ్య నాయుడు చెప్పారు. దీనివల్ల పరస్పర గౌరవం, బాధ్యత, సంయమన భావం ఏర్పడుతుందన్నారు. దురదష్టవశాత్తూ హద్దులు దాటిన సందర్భాలు కొన్ని కనిపిస్తున్నట్లు తెలిపారు. పరిధి దాటినట్లు స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగించే కొన్ని తీర్పులు ఉన్నాయన్నారు. సూపర్ ఎగ్జిక్యూటివ్‌గా, సూపర్ లెజిస్లేచర్‌గా న్యాయ వ్యవస్థ వ్యవహరిస్తోందనే భావన కలిగే విధంగా వ్యవహరించడం వాంఛనీయం కాదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సుప్రీంకోర్టు, హైకోర్టులు సంస్కరణాత్మక జోక్యాలతోపాటు సాంఘిక ఆర్థిక లక్ష్యాలను ప్రోత్సహించేందుకు కొన్ని పరిధి దాటిన తీర్పులు ఇచ్చాయన్నారు. అయితే అప్పుడప్పుడు కోర్టులు తమ పరిధి దాటి శాసన, కార్యనిర్వాహక విభాగాల పరిధిలో ప్రవేశిస్తున్నాయా? అనే ఆందోళనలు రేకెత్తుతున్నాయన్నారు. కొన్ని అంశాలను ప్రభుత్వంలోని ఇతర విభాగాలకు వదిలిపెట్టి ఉండవలసిందనే విషయంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. పరిధి దాటి ఇచ్చిన తీర్పులకు ఉదాహరణగా, దీపావళి బాణసంచా కాల్చడంపై ఇచ్చిన తీర్పును, న్యాయమూర్తుల నియామక పక్రియలో కార్యనిర్వాహక శాఖ పాత్రను నిరాకరిస్తూ ఇచ్చిన తీర్పును, జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వెంకయ్య నాయుడు ప్రస్తావించారు. కొన్ని సందర్భాల్లో శాసన వ్యవస్థ కూడా తన పరిధిని దాటే ప్రయత్నం చేసిందన్నారు. ఇందుకు ఉదాహరణగా 39వ రాజ్యాంగ సవరణను పేర్కొన్నారు. 1975లో ఏర్పడిన పరిస్థితుల్లో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి పదవులకు ఎన్నికలను జ్యుడిషియల్ స్క్రూటినీ పరిధికి అతీతంగా ఉండే విధంగా చేశారన్నారు.

క్రీడారంగాన్ని విషాదంలో ముంచిన మారడోనా

గుండెపోటుతో ఇంట్లోనే హఠాన్మరణం
దిగ్భ్రాంతికి గురయిన ప్రపంచ క్రీడాభిమానులు
సాకర్ ప్రపంచంలో అద్భుతాలు చాటిన ఆటగాడిగా రికార్డు



బ్యూనోస్ ఐరెస్,నవంబర్26(ఆర్ఎన్ఎ): అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, 1986 ఫిఫా ప్రపంచకప్ విజేత డిగో మారడోనా(60) హఠాన్మరణం చెందారు. బుధవారం గుండెపోటుకు గురైన ఆయన మృతి చెందారు. ఈ నెల ఆరంభంలో చేయించుకున్న మెదడు శస్త్రచికిత్స విజయవంతమైనా.. హఠాత్తుగా గుండెపోటుకు గురై మారడోనా ఇంట్లోనే తుదిశ్వాస విడిచారు. అర్జెంటీనా తరఫున 91 మ్యాచ్‌లు ఆడిన ఆల్‌టైమ్ గ్రేట్ ఫుట్‌బాలర్ మారడోనా 34 గోల్స్ చేశారు. దేశం తరఫున నాలుగు ప్రపంచకప్‌ల్లో ప్రాతినిధ్యం వహించారు.

1986 మెగా టోర్నీలో జట్టుకు సారథ్యం వహించి అద్భుత ప్రదర్శనతో టైటిల్ అందించారు. ఆ విశ్వటోర్నీ క్వార్టర్ ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై మారడోనా చేసిన గోల్.. శతాబ్దానికే అత్యుత్తమ గోల్‌గా చరిత్రలో నిలిచి పోయింది. మరో గోల్ చేయి తాకి నమోదైందన్న ఆరోపణలు ఫేమస్ కావడంతో అది 'హ్యాండ్ ఆఫ్ గాడ్' గానూ పేరుతెచ్చింది. అలాగే 1990 ప్రపంచకప్‌లోనూ అర్జెంటినాను మారడోనా ఫైనల్‌కు చేర్చారు. క్లబ్ కెరీర్‌లో బార్సిలోనా, నపోలీ తరఫున బరిలోకి దిగిన డిగో ఆ జట్లకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించారు. నపోలీకి రెండు సిరీస్-ఏ టైటిళ్లను సాధించిపెట్టారు. 1991లో మాదక ద్రవ్యాలు వాడినట్టు డోప్ పరీక్షల్లో తేలడంతో మారడోనా 15 నెలల పాటు నిషేధానికి గురయ్యారు. ఆ తర్వాత 1994 ప్రపంచకప్‌లోనూ అర్జెంటీనాకు సారథ్యం వహించారు. మొత్తంగా 1997లో 37వ పుట్టిన రోజునే ప్రొఫెషనల్ కెరీర్‌కు మారడోనా వీడ్కోలు పలికారు. 2008 నుంచి 2010 వరకు అర్జెంటీనా జట్టుకు హెడ్‌కోచ్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత అమెరికా, మెక్సికో జట్లకు మార్గనిర్దేశర చేశారు. చాలా జట్లకు మేనేజర్‌గా వ్యవహరించిన మారడోనా.. జట్టుకు కోచ్‌గా కొనసాగుతూనే కన్నుమూశారు. చివరి శ్వాస వరకు ఫుట్‌బాల్‌తోనే ప్రయాణించారు. 1986 ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మారడోనా.. ÷నైల్లో పశ్చిమ జర్మనీని ఓడించి జట్టును విశ్వ విజేతగా నిలిపాడు. గుండెపోటుతో హఠాత్తుగా కన్నుమూయడంతో ఫుట్‌బాల్ ప్రపంచాన్ని శోక సంద్రంలో ముంచాడు. అతని మరణంతో ప్రపంచ క్రీడారంగం విస్తుపోయింది. వరల్డ్‌కప్ విజేత మారడోనా.. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. 60ఏళ్ల మారడోనా మెదడులో రక్తం గడ్డకట్టడంతో శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత కోలుకొని ఆసుపత్రి నుంచి డిశ్చార్జయ్యాడు. అయితే, బుధవారం మారడోనాకు గుండెపోటు రావడంతో తన ఇంట్లోనే మృతి చెందినట్టు అతడి లాయర్ తెలిపాడు. కెరీర్, జీవితంలో డీగో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. డ్రగ్స్ బారినపడి చావు అంచుల వరకు వెళ్లినా.. మళ్లీ రాగలిగాడు. ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన దిగ్గజాల్లో మారడోనా పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. సాకర్ ప్రపంచాన్ని శాసించిన మారడోనా అసలు పేరు 'డీగో అర్మాండో మారడోనా'. 1960 అక్టోబరు 30న అర్జెంటీనా, బ్యూన్‌సఎయిర్స్‌లో పేద కుటుంబంలో జన్మించాడు. తండ్రి డిగో మారడోనా, తల్లి డల్మా సాల్వర్డో ఫ్రాంకో. నలుగురు అమ్మాయిల తర్వాత మారడోనా జన్మించాడు. అతడిని ఇద్దరు సోదరులు కూడా ఉన్నారు. ఎనిమిదేళ్ల వయసులోనే ఆటలో అద్భుతాలు చేసేవాడు. 12 ఏళ్ల వయసులో హాఫ్ టైమ్‌లో బంతితో మ్యాజిక్ చేస్తూ.. ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించే వాడు. పొట్టివాడైనా.. ఆటలో ఎంతో గట్టివాడు. 5 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న మారడోనా.. మైదానంలో పాదరసంలా కదిలేవాడు. బంతిపై నియంత్రణ, డ్రిబ్లింగ్ స్కిల్స్‌కు ఫ్యాన్స్ ఫిదా అయ్యేవారు. డీగో మైదానంలో కదులుతున్నాడంటే.. ప్రేక్షకుల్లో ఉత్సాహం వెల్లువలా పొంగేది. వేగంతోపాటు కచ్చితత్వంతో గోల్స్ చేసే డీగోను అభిమానులు 'ఎల్ పైబ్ ది ఓరో (ద గోల్డెన్ బాయ్)' అని ముద్దుగా పిలుచుకొనేవారు. '10' నెంబర్ జెర్సీకి అతడు పర్యాయపదంగా మారాడు. పదహారేళ్ల వయసులో అర్జెంటీనోస్ జూనియర్స్ తరఫున మారడోనా ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేశాడు. 16 నంబర్ జెర్సీతో ఆడిన డీగో.. అనర్జెటీనా ప్రిమెరా డివిజన్‌కు ఆడిన పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 1976-81 వరకు అర్జెంటీనోస్ తరఫున ఆడిన డీగో.. ఆ తర్వాత బోకా జూనియర్స్‌కు మారాడు. ఏడాది తర్వాత బార్సిలోనా అతడిని రికార్డు ధర 8 మిలియన్ డాలర్లకు ఖరీదు చేసింది. ఓ మ్యాచ్‌లో రియల్ మ్యాడ్రిడ్‌పై బార్సిలోనా విజయం తర్వాత.. ప్రత్యర్థి ఆటగాళ్లు మారడోనాకు నిలబడి ప్రశంసించారు. బార్సిలోనా క్లబ్ పెద్దలతో అనేకసార్లు ఘర్షణ పడడం అతడి కెరీర్‌ను దెబ్బతీసింది. కానీ, ఆటలో అతడు మంచి ఫామ్‌లో

ఉన్న సమయంలో.. 1984లో ఇటలీ క్లబ్ నపోలీకి.. మారడోనాను బార్సిలోనా అమ్మేసింది. ఆ క్లబ్‌కు అంతా తానై వ్యవహరించిన డీగో.. ఒంటిచేత్తో ఇటాలీగ్ టైటిల్‌ను సాధించిపెట్టాడు. అయితే, ఈ సమయంలోనే వ్యక్తిగత ఇబ్బందులు పెరగడంతో మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డాడు. ఒత్తిడి కారణంగా ప్రాక్టీస్ కూడా వెళ్లేవాడు కాదు. దీంతో అనేకసార్లు అతడికి జరిమానా కూడా విధించారు. అక్రమ సంతానంతోపాటు డ్రగ్స్ మాఫియాతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో అనేక కేసులు ఎదుర్కొన్నాడు. 16 ఏళ్ల వయసులో 1977లో హంగేరిపై మ్యాచ్ ఆడాడు. 1978లో సొంతగడ్డపై జరిగిన వరల్డ్‌కప్‌లో డీగోకు చోటుదక్కలేదు. వయసు తక్కువ కావడంతో అతడిని టీమ్‌కు ఎంపిక చేయలేదు. 1979లో జరిగిన ఫిఫా యూత్ వరల్డ్ చాంపియన్‌షి?ప్‌లో మారడోనా స్టార్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో తొలి అంతర్జాతీయ గోల్ సాధించాడు.ఇటలీలో జరిగిన 1990 వరల్డ్‌కప్‌లో మారడోనా కెప్టెన్సీలో బరిలోకి దిగిన డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా ఆరంభంలో నిరాశపరిచినా ఫైనల్‌కు చేరుకొంది. అయితే, ఈ టోర్నీలో మారడోనా ముందులా తన మాయాజాలాన్ని మాత్రం ప్రదర్శించలేక పోయాడు. తుది పోరులో జర్మనీ చేతిలో అర్జెంటీనా ఓడింది. 1994లో అమెరికాలో జరిగిన విశ్వకప్‌లో మారడోనా కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. డోపింగ్‌లో పాజిటివ్‌గా రావడంతో టోర్నీ నుంచి తప్పించారు.

ఎన్నికల్లో విధ్వంసానికి కుట్ర : డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 26: గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను ఆసరా చేసుకొని హైదరాబాద్ నగరంలో, తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని చోట్ల కొంత మంది విధ్వంసక శక్తులు మత ఘర్షణలు, విద్వేశాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, తమకు ఖచ్చితమైన సమాచారం ఉందని డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో తెలంగాణ పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉందన్నారు. అన్ని జిల్లాల పోలీస్ అధికారులు, కమిషనర్లు, కింది స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. అంసాఘిక, మతత్వశక్తులు, రౌడీ షీటర్స్‌పై నిరంతరం నిఘా పెట్టినట్లు తెలిపారు. విధ్వంసక శక్తుల విషయంలో పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఎవరైనా, ఎంతటివారైనా వెనుకాడేది లేదని డీజీపీ స్పష్టం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సోషల్ మీడియా వేదికగా ప్రజల మనోభావాలను దెబ్బతీసి, సామరస్యపూర్వక వాతావరణాన్ని భగ్నం చేసే కుట్రలు జరుగుతున్నాయని డీజీపీ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాపై పోలీసు శాఖ నిఘా పెట్టిందని తెలిపారు. అనేక రకాల నూతన టెక్నాజీని వినియోగించి రొచ్చుగొట్టే పోస్టులు వచ్చినప్పుడు గుర్తించి, ప్రభావాన్ని తగ్గించి, నిజానిజాలను ప్రజలకు తెలియజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక శక్తుల పన్నాగంలో చిక్కుకోకుండా పోలీసులశాఖతో సమన్వయం చేసుకొని ప్రజలంతా సహాయ సహకారాలు అందించాలని కోరారు. సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి పోస్టులు వాటిని నమ్మొద్దని, ఇతరులకు షేర్ చేయకుండా దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల విషయంలో రాష్ట్రంలో కానిస్టేబుల్ నుంచి కమిషనర్లు, జోనల్ ఐజీల వరకు భాగస్వాములను చేశామని.. నిర్భయంగా, నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా గుర్తించి, చర్యలు తీసుకునేందుకు అప్రమత్తంగా ఉన్నామన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీహెచ్ఎంసీ ఎన్నికలు

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా చూడడమే పోలీసుశాఖ లక్ష్యమని మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. పోలీస్‌శాఖకు సహాయ సహకారాలు అందిస్తే మరింత పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు

అవకాశం ఉంటుందన్నారు. ప్రశాంతంగా ఓటింగ్ జరిగేందుకు సిబ్బంది సైతం అకుంఠిత దీక్షతో పని చేయాలని సూచించారు. మూడు కమిషనరేట్ల పరిధిలో ఎన్నికల సందర్భంగా 51,500 మంది పోలీస్ సిబ్బంది సివిల్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ, ఇతర విభాగాలతో భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ అత్యవసరం ఉన్నా తక్షణమే స్పందించేలా పెట్రోలింగ్, బ్లూకోట్స్, స్పెషల్ మొబైల్ పార్టీలు, సీనియర్ పోలీసుల అధికారులను పలు ఏరియాలకు ఇన్‌చార్జిలుగా నియమించినట్లు చెప్పారు.

ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలపై రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన సమాచారం మేరకు పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు, ఇద్దరు జోనల్ ఐజీలు, రేంజ్ డీఐజీలు, ఏజీ లా అండ్ ఆర్డర్ పాల్గొన్నారన్నారు. తమకు వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పసిగడుతూ విధ్వంసక శక్తులు తమ మనసులో ఉన్న ప్రణాళికను అమలు చేసే లోపే వాటిని కట్టిడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ప్రసంగాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, రొచ్చుగొట్టే వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. ఇప్పటి వరకు 50 కేసులు నమోదు చేశామని, అవన్నీ విచారణలో ఉన్నాయని, చట్ట ప్రకారం చర్యలుంటాయని స్పష్టం చేశారు.

మరడోనా మృతికి గంగూలీ,సచిన్‌ల దిగ్భ్రాంతి

కోల్‌కతా,నవంబర్26(ఆర్ఎన్ఎ): ఫుట్‌బాల్ దిగ్గజ ప్లేయర్ డీగో మారడోనా హఠాన్మరణంపై బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు తన ట్విట్టర్ అకౌంట్‌లో భావోద్వేగ పోస్టు చేశారు. నా హీరో ఇక లేరు.. నాకు పిచ్చిగా నచ్చిన ఆటగాడికి వీడ్కోలు పలుకుతున్నా.. నీ కోసమే నేను ఫుటబాల్ చూసేవాడినని సౌరవ్ తన పోస్టులో రాశారు. ఫుట్‌బాల్ ఆటలో గొప్ప క్రీడాకారుడిగా గుర్తింపు పొందిన డీగో మారడోనా.. బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. అతని మృతి క్రీడాలోకాన్ని తీవ్ర దుఖంలోకి ముంచేసింది. బీసీసీఐ అధ్యక్షుడు, మాజీ క్రికెటర్ గంగూలీ.. మారడోనాతో కలిసి దిగిన ఓ ఫోటోను కూడా తన ట్వీట్‌లో షేర్ చేశారు. మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కూడా మారడోనా మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. తన ట్వీట్‌లో నివాళి అర్పించిన సచిన్.. ఫుట్‌బాల్‌తో పాటు యావత్ క్రీడాలోకం ఓ మేటి ఆటగాడిని కోల్పోయిందన్నారు. రెస్ట్ ఇన్ పీస్ మారడోనా. మేం నిన్ను మిస్ అవుతున్నామని సచిన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ట్రంప్‌ను కూడా తీసుకువస్తారేమో..

బీజేపీపై సెటైర్లు వేసిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్,నవంబరు 26(ఆంఎన్ఎ): జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో మంచి స్పీడుమీదున్న మంత్రి కేటీఆర్.. తన వాక్చాతుర్యంతో బీజేపీ నేతలపై సెటైర్ల మీద సెటైర్లు వేస్తున్నారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలకు ధీటైన కౌంటర్లు ఇస్తూ ఉక్కిరి బిక్కిరి చేస్తున్న కేటీఆర్.. తాజాగా మరో సెటైరికల్ బాంబ్ పేల్చారు. జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన.. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారానికి ఢిల్లీ స్థాయి లీడర్లు మొదలుకొని, వివిధ రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు రావడంపై తనదైన శైలిలో స్పందించారు. ఢిల్లీ నుంచి ప్రచారం కోసం వస్తున్నారని, రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయి నాయకులను కూడా ప్రచారానికి తీసుకువస్తారేమో అని పంచ్ వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్నేహితుడైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రచారానికి తీసుకు వస్తారేమో అని సైటెర్లు పేల్చారు. అయితే ఎవరు వచ్చినా తమకు అభ్యంతరం లేదని, ప్రజల దీవెనలే తమ ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు.

హైదరాబాద్‌లో సామరస్యాన్ని చెడగొట్టనివ్వం: కవిత

న్యూఢిల్లీ, నవంబర్ 26: జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నేతలు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తుండటంపై టీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కొందరు నగరంలో మత సామరస్యాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, తాము అందుకు ఏమాత్రం అవకాశం ఇవ్వబోమని ఆమె తేల్చిచెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఎన్నికలు ఒక కులం కోసమో, ఒక మతం కోసమో, ఒక ప్రాంతం కోసమో జరుగుతున్నవి కాదని.. హైదరాబాద్ భవిష్యత్తు కోసం జరుగుతున్న ఎన్నికలని కవిత చెప్పారు.

హైదరాబాద్ నగర యువతకు తాను చేసే వినతి ఒక్కటేనని, వారు హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటు ఎవరికి వేయాలో నిర్ణయించుకోవాలని కోరారు. అంతేతప్ప మతాల మధ్య చిచ్చుపెట్టేలా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్న వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

ఏ పార్టీ అయినా వదలం

శాంతి భద్రతల విషయంలో రాజీపడబోం
-మంత్రి క

వ్యూహాత్మక ఎజెండా సెట్ చేస్తోన్న బిజెపి

నేటినిజం
శుక్రవారం 27-11-2020

గ్రేటర్ ఎన్నికల్లో బిజెపి వ్యూహాత్మక ఎజెండా సెట్ చేస్తూ ఇతర పార్టీలను అందులోకి లాగుతోంది. బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ తాజా రాజకీయ విమర్శలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. పాతబస్తీలో అక్రమంగా తిష్టవేసిన రోహింగ్యాలరు, పాక్ పౌరులను తరలించేందుకు సర్జికల్ స్ట్రయిక్స్ చేస్తామని చేసిన విమర్శలు కావచ్చు..లేదా ప్రకటన కావచ్చు ఇప్పుడు ఎజెండ సెట్ చేయడానికి వ్యూహాత్మకంగా చేసిన ప్రకటనగానే చూడాలి. ఇది మెజార్టీ ప్రజలకు కూడా ఆమోదయోగ్యంగానే కనిపించవచ్చు. కానీ దీనిపై సమాధానం చెప్పుకోవాల్సిన అనివార్య అవసరాన్ని టిఆర్ఎస్, ఎంఐఎంలకు బిజెపి కల్పించింది. అందుకే దీనిపై నేరుగా ఈ పార్టీలు సమాధానం ఇవ్వకుండా డొంకతిరుగుడు సమాధానాలు ఇస్తున్నారు. హైదరాబాద్ పై సర్జికల్ స్ట్రయిక్స్ చేస్తారా అని ఎదురుదాడి చేస్తున్నారు.గతంలో లేదా ఇప్పటివరకు ప్రతి ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ ఎజెండగా ఉండేది. తెలంగాణ ద్రోహులు అన్న పదాలు బాగా పరిభ్రమించేవి. అధికార టిఆర్ఎస్ వీటిని బాగా సెట్ చేసేది. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ రాజకీయాలకు కాలం చెల్లిందన్న విషయం తాజా ప్రచారంతో స్పష్టమయ్యింది. ఇంకా సెంటిమెంట్ రాజకీయాలను ప్రజలు స్వాగతించరని కూడా దుబ్బాక ఫలితం తరవాత తెలుస్తోంది. ప్రతి ఎన్నికలోనూ టీఆర్ఎస్ పన్నిన వ్యూహంలో చిక్కుకుని ఇతర పార్టీలు విలవిలలాడేవి. దానికి తెలంగాణ సెంటిమెంట్ కూడా కారణం కావచ్చు. కానీ ఇప్పుడు అందుకు భిన్నమైన రాజకీయ వాతావరణం నడుస్తోంది. బిజెపి సెట్ చేసిన ఎజెండాలో టిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు నడుస్తున్నాయా అన్న భావన కలుగుతోంది. ఎందుకంటే బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ దూకుడుతో తమ అజెండాను పక్కన పెట్టారు. ఆయన విమర్శలకు సమాధానం చెప్పడమే ప్రచారంగా చేసుకుంటు న్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ మా ప్రధాన ప్రత్యర్థి అని ప్రకటించిన టీఆర్ఎస్.. ఈసారి తమకు మద్దతుదారుగా ఉండే మజ్లిస్‌ను ప్రధాన పోటీదారుగా ప్రకటించడం ద్వారా ప్రజల్లో అభాసుపాలయ్యింది. అయినా బిజెపి విమర్శలపైననే కెటిఆర్ ప్రధానంగా దృష్టి సారించారు. రాష్ట్రంలో గులాబీ దళానికి కమలం పార్టీ ప్రధాన ప్రత్యర్థిగా మారింది. ఈ విషయాన్ని టీఆర్ఎస్ నేతలు తమ ప్రసంగాలు, విమర్శల ద్వారా అంగీకరించక తప్పడం లేదు. తమకు ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ అని మంత్రి తలసాని, తమ ప్రధాన పోటీదారు మజ్లిస్ అని మంత్రి కేటీఆర్ తొలుత వ్యాఖ్యా నించారు. కానీ, ప్రచారంలో టీఆర్ఎస్ ప్రధానంగా బీజేపీనే లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోంది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇద్దరూ అభివృద్ధి అజెండాను పక్కకుపెట్టి.. బీజేపీ విమర్శలకు ప్రతి విమర్శలు చేయాల్సి వస్తోంది. బిజెపి భయంతోనే వారు తమ ప్రచార వ్యూహాలకు పదను పెడుతున్నారు. బిజెపిని టార్గెట్ చేస్తున్నారు. తద్వారా తమకు బీజేపీతోనే ప్రధాన పోటీ అని అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇదంతా ఓ రకంగా బిజెపి సెట్ చేస్తున్న ఎజండాయే కారణం. ఎపిలో గత ఎన్నికలకు ముందు జగన్ కూడా ఇలాంటి వ్యూహాన్న రచించారు. తెలుగుదేశం పార్టీ ఆ ట్రాప్‌లో పడి కొట్టుకు పోయింది. నగర ప్రజల మనోభావాలను, సెంటిమెంట్లను బిజెపి బాగా వంటిపట్టించుకుంది. వారికి ఏది చెబితే ఆకర్షితులు అవుతారో అవే విషయాలను బిజెపి ప్రస్తావిస్తోంది. అందుకే గ్రేటర్ ఎన్నికల ఫలితాల తర్వాత మజ్లిస్ అభ్యర్థి మేయర్ అవుతారని, టీఆర్ఎస్, ఎంఐఎం మధ్య పొత్తు ఉందని బీజేపీ నేతలు ప్రకటించి, తమకు టిఆర్ఎస్ దూరం అన్న విషయాలను ప్రచారం చేసేందుకు తంటాలు పడుతున్నారు. అయితే సామాజిక మాధ్యమాల్లో వీరి స్నేహంపైనా, గతంలో చేసిన ప్రకటనల పైనా పదేపదే పోస్టింగ్‌లు ప్రజలను ఆలోచించేలా చేస్తున్నాయి. బండి సంజయ్ చెప్పిందే కరెక్ట్ అన్న రీతిలో సామాజిక మాధ్యామల్లో ప్రచారం సాగుతోంది. వరద సాయం ఆపాలంటే బండి సంజయ్ ఇసికి రాసిన లేక.. దానిపై సీఎం కేసీఆర్‌కు సవాల్ విసరడాన్ని వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడగానే భావించాలి. దీనిపై గట్టిగా ఎదిరించే సాహసం చేయలేక పోయారు. ఆయన విసిరిన సవాల్‌ను టీఆర్ఎస్ నేతలు ఎవరూ స్వీకరించలేదు. ఆ తర్వాత ప్రచారం మొత్తం వరద రాజకీయాల చుట్టూనే తిరుగుతున్న విషయాన్ని గమనించవచ్చు. పదివేల సాయం అడ్డుకున్న వారు 25వేల సాయం ఎలా చేస్తారంటూ కెటిఆర్ , టిఆర్ఎస్ నాయకులు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బీజేపీ నేతలు పదేపదే చేసే వ్యాఖ్యలకు కూడా టీఆర్ఎస్ నేతలు జవాబు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. బండి సంజయ్ చలాన్లు, సర్జికల్ స్ట్రయిక్స్ వ్యాఖ్యలకు కెటిఆర్ స్పందించడం చూస్తుంటే బిజెపి ఎజెండా సెట్టింగ్‌లో విజయం అయ్యిందనే చెప్పాలి. అందుకు బిజెపిని దెబ్బకొట్టాలన్న లక్ష్యంతో కెసిఆర్, కెటిఆర్‌లు జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీని కూడా విమర్శిస్తున్నారు. కేంద్ర నిర్ణయాలను తప్పుబడుతున్నారు. హైదరాబాద్‌లో ఎక్కువగా ఉండే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను ఆకర్షించడమే దీని లక్ష్యంగా చూడాలి. 26న జరిగే సార్వత్రిక సమ్మెతో పదేపదే విమర్శిస్తున్నారు. మజ్లిస్‌తో తమకు పొత్తు లేదని మంత్రి కేటీఆర్ చెప్పేందుకు ప్రచారం చేస్తున్నారు. బిజెపి, మజ్లిస్ రెండు పార్టీలను ఓడించాలని రోడ్‌షోలలో ప్రచారం చేస్తున్నారు. అలాగే టీఆర్ఎస్‌ను ఓడిస్తామని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ కార్మికులను ఆకట్టుకునేలా ఎల్ఐసి తదితర రంగాల ప్రైవేటీకరణను ప్రస్తావిస్తున్నారు. ఇవన్నీ కూడా తమకు కలసి వచ్చేవే అన్నట్లుగా బిజెపి నేతలు ఉన్నారు. తమ విమర్శలకు సమాధానం రాబట్టుకోవడం కూడా బిజెపి ఎత్తుగడగానే భావించాలి. తమను ప్రత్యర్థిగా టీఆర్ఎస్ గుర్తించడమంటే పోటీలో తామే ఉన్నట్టు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లినట్టేనని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. తద్వారా, దుబ్బాక తరహాలోనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ లబ్ది పొందుతామని భావిస్తున్నారు. ఈ దిశగా కమలనాథులు అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. వరద సాయాన్ని బండి సంజయ్ ఆపారంటూ వీడియో వైరలైంది. కానీ, భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేయడం ద్వారా ఆ విమర్శకు చెక్ చెప్పినట్లు అయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆరేళ్లుగా టీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పోటీనిస్తూ వస్తోంది. కానీ, ఇప్పుడు ప్రతిపక్ష పాత్ర నుంచి అనుకోకుండానే కాంగ్రెస్ మాయమయ్యింది. రాష్ట్రంలో కాంగ్రెస్ స్థానంలోకి బీజేపీ వచ్చి చేరింది. కాంగ్రెస్‌ను పూర్తిగా దెబ్బతీస్తే తమకు తిరుగు ఉండదని భావించిన కెసిఆర్..ఆ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను ఇతర నేతలను భారీగా చేర్చుకున్నారు. దీంతో కాంగ్రెస్ బలహీనపడ్డా ఆ స్థానంలోకి బిజెపి రాకెట్‌లా దూసుకుని వస్తోంది. గతంలో వివిధ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికల తర్వాత అధికార పార్టీలో చేరారు. ఎమ్మెల్యేల నుంచి స్థానిక సంస్థలు వంటి వాటిల్లో గెలుపొందిన వారు కూడా అధికార పార్టీలో చేరారు. తద్వారా, కాంగ్రెస్‌ను గెలిపిస్తే టీఆర్ఎస్‌లోకి వెళ్లిపోతారనే అభిప్రాయం బలంగా ఏర్పడింది. దీంతో ఇది కూడా గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మైనస్ కాబోతున్నది. కాంగ్రెస్‌కు ఓటేసినా టిఆర్ఎస్‌కు వేసినట్లేనని, గెలిచిన వారు ముందే జంప్ అవుతారన్న భావన ప్రజల్లో ఏర్పడింది. ఇది కూడా బిజెపికి కలసి రావడమే గాకుండా... ఇప్పుడు గ్రేటర్ ఎన్నికల్లోనూ అదే ప్రచారం చేస్తోంది. మొత్తంగా టిఆర్ఎస్‌కు ఇప్పుడు ప్రత్యర్థి బిజెపి అన్న ప్రచారం ప్రజల్లోకి బాగా చేరింది.

కాళేశ్వరంతో తీరుతున్న కష్టాలు

పండగలా సాగుతున్న వ్యవసాయం

కరీంనగర్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ కష్టంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు, ఎల్ఎండీ, ఎస్సారెస్పీ జలాలతో రాష్ట్రంలోని జలాశయాలన్నీ మత్తడి దుంకుతున్నాయని ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు ఆనందం వ్యక్తం చేశారు. వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన చెప్పారు. అన్నదాతలను అన్ని విధాలా ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. ఉద్యమ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో పండుగ వాతావరణంలో రైతులు వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరానికి మించి ధాన్యం సేకరిస్తున్నట్లు వివరించారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లించాలన్న లక్ష్యంతోనే ధాన్యం కొనుగోలుకు ముందుకు వచ్చినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాలను ప్రతి ఒక్కరూ వినియో గించుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలతో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర మంత్రులు ఆకర్షితులై ప్రశంసల వర్షం కురిపిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేతలు ప్రభుత్వ పనితీరును గుర్తించకుండా ఊదరగొట్టే ఉపన్యాసాలతో కాలం వెలిబుచ్చుతున్నట్లు ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల సేవలను విస్తృతం చేసేలా కేంద్ర మంత్రులు కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు

సిద్ధంగా ఉన్నామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు ధర పొందాల్సిందిగా కోరారు.

ఆరోగ్య రంగంలో కెసిఆర్ ముందుచూపు

-ప్రాథమిక కేంద్రాల బలోపేతం: ఎమ్మెల్యే

పెద్దపల్లి,నవంబరు 26(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. దవాఖానలో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో రోగులకు సరైన సమయంలో సేవలు అందిస్తున్నారని, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లకు డాక్టర్లు అందుబాటులో ఉంటూ, వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. దవాఖాన పరిసరాలను పరిశీలించి జనరల్ వార్డు, ఆపరేషన్ థియేటర్లు, ఎక్స్‌రే, పిల్లల వార్డు, ల్యాబ్, రక్తనిధి నిల్వ కేంద్రాల పనితీరు బాగున్నాయని ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ఆరోగ్యశ్రీ సేవలు, కేసీఆర్ కిట్టు, దివ్యాంగుల కోసం సదరమ్ క్యాంపుతోపాటు అనేక వైద్య సేవలను అందిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా చికిత్స గురించి స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అదుపులోనే శాంతిభద్రతలు: సిపి

కరీంనగర్,నవంబర్26(ఆర్ఎన్ఎ): రామగుండం కమిషనరేట్‌లో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, 71మందిపై పీడీ యాక్టు నమోదు చేయడంతో నేరస్థుల గుండెల్లో గుబులు పుడుతుందని రామగుండం సీపీ సత్యనారాయణ అన్నారు.

హత్యా నేరాలు తగ్గాయని, రేప్ కేసులు పెరిగాయని, అందులో ఫాల్స్ ప్రామిసెస్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయని చెప్పా రు. అక్రమంగా ఫైనాన్స్‌లు నడుపుతున్న 87మందిపై మనీలాండరింగ్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. . ఇతర రాష్ట్రాలతో సరిహద్దు ఉన్న గోదావరి పరివాహకంలో నిత్యం కూంబింగ్ నడుస్తోందని అన్నారు.

ఉనికి కోసం ఉత్తర తెలంగాణ జిల్లాలకు వచ్చిన మావోయిస్టులు పోలీసుల అలర్ట్‌తో పారిపోయారని అన్నారు. ఇదిలావుంటే మావోల ఉనికి లేదని ఐజి నాగిరెడ్డి కూడా ఇప్పటికే ప్రకటించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ గోదావరి పరివాహక ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిలేదని, పోలీస్ యాక్షన్‌కు మావోయిస్టులు పారిపోయారని ఐజీ నాగిరెడ్డి అన్నారు.

ఆసిఫాబాద్, ములుగులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు చనిపోయారని చెప్పారు. రామగుండం కమిషనరేట్‌లో ప్రభుత్వరంగ సంస్థలు, కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు ఉండడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ పెట్రోలింగ్ పెంచుతున్నట్టు పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా జీవించడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సరిహద్దు జిల్లాలోని పోలీసులను సమన్వయం చేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

రైతులను మోసం చేస్తున్న సర్కార్

కరీంనగర్,నవంబర్26(ఆర్ఎన్ఎ): ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ మూసేసి వందలాది మంది ఉద్యోగులను బజారున పడేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఆది శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పట్ల వివక్ష కనబరుస్తూ రైతు వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సన్నరకం వడ్లను సాగు చేయాలని చెప్పి మద్దతు ధర ప్రకటించక కొనుగోలు చేయక పోవడంతో రైతాంగం అయోమయ స్థితిలో ఉన్నారని అన్నారు. రుణమాఫీ చేస్తామని నమ్మించి ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. రైతు ప్రభుత్వమని నిత్యం చెప్పుకోవడమే తప్ప చేసిందేమీ లేదన్నారు.

గత ఎన్నికల్లో కేసీఆర్ కూతురు కవిత పసుపు బోర్డు తెస్తానని నమ్మించి రైతులను మోసానికి గురిచేసిందని చెప్పారు. రైతులను మోసగిస్తున్న టీఆర్ఎస్ సర్కారుకు తెలంగాణలో నూకలు చెల్లే రోజులు వచ్చాయన్నా రు.

రాజ్యాంగమే శ్రీరామరక్ష కావాలి

(26 నవంబర్ "భారత రాజ్యాంగ దినోత్సవం" సందర్భంగా)

26 నవంబర్ 1949న భారత రాజ్యాంగాన్ని చట్టసభ ఆమోదించిన శుభ సందర్భంగా ప్రతియేట 26 నవంబర్ రోజున "భారత రాజ్యాంగ లేదా భారత చట్ట లేదా సంవిధాన్ దినోత్సవం" ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇదే భారత రాజ్యాంగం 26 జనవరి 1950న అమలులోకి వచ్చింది. 11 అక్టోబర్ 2015 రోజున రాజ్యాంగ నిర్మాత డా: బి ఆర్ అంబేద్కర్ 125వ జన్మదిన వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో రాజ్యాంగ దినం జరుపుకుంటున్నాం. అంతకు పూర్వం 26 నవంబర్‌ను జాతీయ చట్ట దినోత్సవం (నేషనల్ లా డే)గా పాటించేవారు. దేశానికి ఆయువు రాజ్యాంగం. శాంతియుత సహజీవనసారాన్ని బోధించేది రాజ్యాంగం. భారత రాజ్యాంగం పట్ల ప్రజలు, యువత మరియు విద్యార్థినీవిద్యార్థుల్లో సంపూర్ణ అవగాహన కల్పించడంతో పాటు మాక్ పార్లమెంట్ నిర్వహణ లక్ష్యాలతో రాజ్యాంగ దినం నిర్వహిస్తారు.

సంఘ సంస్కర్త, నిబద్ధతగల రాజకీయ నాయకుడు, మేధావి, న్యాయకోవిదుడు, భారత రాజ్యాంగ రచన కమిటీ చైర్మన్ డా: అంబేద్కర్‌ను రాజ్యాంగ పితామహుడిగా కొనియాడడం మనందరి కనీస బాధ్యత అని మరువరాదు. భారత రాజ్యాంగ ఉపోద్ఘాతం (ప్రయాంబుల్)లో పొందుపరిచిన పౌరుల హక్కులు మరియు బాధ్యతలను పాటిస్తూ, దేశభక్తిపరులుగా నిరూపించుకోవాలి. అందరికి సమన్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలను కల్పించిన రాజ్యాంగమే ప్రజలకు పవిత్రగ్రంథం కావాలి. భారత రాజ్యాంగం గీసిన గీతను దాటిన వారు నేరస్థులుగా శిక్షార్హులు అవుతారు. రాజ్యాంగం నిర్మాతలు సూచించిన మార్గం, రాజ్యాంగంలోని విలువలు మరియు స్ఫూర్తితో ముందుకు సాగిన జనులు జాతి నిర్మాతలుగా పరిగణించబడతారు. 370 ఆర్టికిల్ తొలగించన తరువాత 70వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జమ్ము కాశ్మీర్ రాష్ట్రం తొలిసారి 26 నవంబర్ 2020న నిర్వహించుకొనుటకు ఉత్సాహపడుతున్నది. భారత రాజ్యాంగం సూచించిన బాధ్యతలను నిర్వహించిన వారే హక్కులను అనుభవించుటకు అర్హులు మరియు అసలైన దేశభక్తులని తెలుసుకుందాం. ఏ విషమ పరిస్థితిలోనైనా రాజ్యాంగ పరిధి దాటరాదు.

ప్రస్తుత సమాజంలో నెలకొన్న అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలు, ఆర్థిక అసమానతలు, కులమత వివక్షలు, హత్యారాజకీయాలు, నేర చరిత్రగల సభ్యులు చట్టసభల్లో ప్రవేశాలు, అవినీతిరాజ్యమేలే కార్యాలయాలు, అక్రమార్జనలు లాంటి అనేక అవలక్షణాలు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతాలుగా, దేశాభివృద్ధికి శరాఘాతాలుగా మరియు శాంతి భద్రతలను అవరోధాలుగా నిలుస్తుండటం అతి విచారకరం. ప్రజాప్రతినిధుల లంచావతారాలు, రోజుల్లో కోట్లు గడించడాలు బహిరంగ రహస్యం అయిన రోజుల్లో అవినీతి అధికారుల బాబోతాలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. చివరికి న్యాయవ్యవస్థ కూడా అవినీతి ఆరోపణలతో సతమతమవుతున్న రోజుల్లో రాజ్యాంగ స్ఫూర్తి నేతిబీరలో నెయ్యి అయ్యిందని బాధ్యతగల పౌరులు బాధపడుతున్న కాలమిది. అవినీతి అంతటా కోవిడ్-19 అంటువ్యాధిలా వ్యాపించక ముందే భారతావని భాగ్యాన్ని తిరిగి లిఖిద్దాం. మనిషికి ప్రాణవాయువు ఎంత ముఖ్యమో రాజ్యానికి రాజ్యాంగం అంతే ప్రధానమని పదిల పరుచుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఉమ్మడి జిల్లాలో రాజకీయ కలకలం

గంపగుత్తగా నేతలు బిజెపిలో చేరేందుకు రంగం సిద్ధం
మాజీ కేంద్రమంత్రి చారి పయనమెటు అంటూ చర్చ?

ఆదిలాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ కలకలం చెలరేగుతోంది. వివిధ పార్టీలకు చెందిన నేతలు బిజెపిలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టిఆర్ఎస్‌ను ఢీకొనాలంటే బిజెపిఒక్కటే శరణ్యమన్న రీతిలో జిల్లా రాజకీయ పార్టీల నేతలు ఉన్నారు. దీంతో గతకొంత కాలంగా పలువురు రాజకీయ నేతలు బిజెపిలో చేరుతారన్న వార్తలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ క్రమంలో మాజీకేంద్ర మంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి ఎటు వైపు నఅ÷-న చర్చ కూడా సాగుతోంది. ఈ మధ్య ఆయన సైలెంట్ అయ్యారు. ఎక్కడా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. అడపాదడపా టీవీ చర్చల్లో కనిపిస్తున్నా రాజకీయంగా చురుకుగా కానరావడం లేదు. ఇంద్రకరణ్ రెడ్డి మంత్రి అయ్యాక ఆయనను సిఎం కెసిఆ÷- పక్కన పెట్టారు. కేంద్రంలో ఢిల్లీ అధికార ప్రతినిధిగా ఉన్న ఆయన పదవిని కూడా పొడిగించలేదు. దీనికితోడు ఇంద్రకరణ్ రెడ్డితో ఆయనకు పొసగడం లేదని సమాచారం. ముందునుంచీ ఇంద్రకరణ్‌కు చారికి రాజకీయ విభేదాలు ఉన్నాయి. అయితే ఆయన ఎటువైపు మొగ్గు చూపుతారో అని అనుచరులు కూడా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మాజీ ఎంపి రమేశ్ రాథోడ్ తన భార్యతో బిజెపిలో చేరడానికి రంగం సిద్ధం అయ్యింది. ప్రస్తుతం జిల్లా రాజకీయ వర్గాల్లో బీజేపీలో చేరికల వ్యవహారమే హాట్‌టాపిక్‌గా మారింది. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి నేడోరేపో కాషాయ కండువా కప్పుకునే అవకాశాలున్నాయంటూ సోషల్‌మీడి యాలో విస్తృతప్రచారం జరిగింది. దీనికి అనుగుణంగానే వార్తలు ప్రసారం కావడ ంతో అంతటా దీనిపైనే చర్చ మొదలైంది. మరోవైపు జిల్లా కాంగ్రెస్ పార్టీలో గతవారం రోజుల నుంచి అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆ పార్టీకి చెందిన జిల్లాస్థాయి నేతలు బీజేపీలో చేరబోతున్నారన్న ప్రచారంతో కార్యకర్తలంతా ఏది నిజమో కాదో అన్న ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజుల నుంచి వీరి చేరికల విషయమై సోషల్‌మీడియాలో పెద్దఎత్తున కథనాలు వైరల్ అవు తుండడం రాజకీయ చర్చకు కారణమవుతోంది. నిర్మల్‌లోని మహేశ్వ ర్‌రెడ్డి నివాసగృహం కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయన మద్దతుదారుల కోలాహలంతో నిండిపోయింది. ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా మహేశ్వర్‌రెడ్డిని స్వయంగా కలవబోతున్నా రన్న ప్రచారం ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. మరోవైపు బీజేపీ జిల్లాస్థాయి నాయకులు కూడా మహేశ్వర్‌రెడ్డి చేరిక విషయంలో ఆయనపై ఒత్తిడి తెస్తున్నట్లు అనుచరులు పేర్కొంటున్నారు. అలాగే ఖానాపూర్ సెగ్మెంట్ నుంచి మాజీ ఎంపీ రమేష్‌రాథోడ్ కూడా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ఆయన అనుచరులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ముథోల్ నుంచి ఇటు నారాయణరావు పటేల్ అటు ఆయన సోదరుడైన మోహన్‌రావు పటేల్‌లు కూడా బీజేపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారంటున్నారు. అయితే రమేష్‌రాథోడ్, నారాయణరావుపటేల్, మోహన్‌రావుపటేల్‌లు నిర్మల్ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో జతకట్టి మూకుమ్మడిగా బీజేపీ లో చేరే అవకాశాలున్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఇప్పటికే మహేశ్వర్‌రెడ్డి, రమేష్ రాథోడ్‌తో ఆపార్టీ అగ్రనేత భూపేంద్రసింగ్ యాదవ్ సంప్రదింపులు కూడా జరుపుతున్నారన్న సమాచారం ఉంది. బీజేపీకి చెందిన రాష్ట్రస్థాయి గిరిజన నాయకుడు రాథోడ్‌చేరికపై ఒత్తిడి తెస్తున్నా రంటున్నారు. దీంతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు రాష్ట్రస్థాయి సీనియర్ నాయకులు సైతం రమేష్ రాథోడ్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్నారంటున్నారు. ఖానా పూర్ నియోజకవర్గంలో బలమైన నాయకునిగా రాథోడ్‌కు పేరుంది. టీడీపీ హయాం లో ఆయన జిల్లాస్థాయి అగ్రనేతగా ఎదిగారు. జడ్పీ చైర్మన్‌గా, ఎంపీగా, ఎమ్మెల్యేగా ఆయన కీలకపదవులను చేపట్టి ప్రత్యర్థివర్గాలకు దడ పుట్టించారు. అయి తే టీఆర్ఎస్ హవా కారణంగా తన వరుస ఓటములను చవి చూసినప్పటికీ అనుచరవర్గాన్ని మాత్రం కోల్పోలేదు. ఇదిలా ఉండగా ముథోల్ నియోజకవర్గంలో కూడా పలువురు కాంగ్రెస్ నాయకులు టీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. మొదటి నుంచి ముథోల్ నియోజకవర్గంలో బీజేపీకి గట్టిపట్టు ఉంది. బలంగా ఉన్న ఆ పార్టీలో చేరేందుకు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, ఆయన సోదరుడు మోహన్‌రావు పటేల్‌లు వేరువేరుగా తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారంటున్నారు. మొ త్తానికి సీనియర్ నాయకులంతా బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తుండడం జిల్లా సరికొత్త రాజకీయ సమీకరణలకు వేదిక కాబోతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

విజయ డెయిరీ సెంటర్‌ను ప్రారంభించిన భూమా రెడ్డి

ఆదిలాబాద్, నవంబర్ 26: రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమా రెడ్డి తెలిపారు. గురువారం ఆదిలాబాద్‌లో విజయ డెయిరీ పాలు, పాల పదార్థాల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల విజయ డెయిరీని నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో విజయ డైయిరీ అన్ని రకాల అభివృద్ధి చెందుతుందని, రోజుకు 5 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.పాడి రైతులకు సబ్సిడీపై బర్రెలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. విజయ డెయిరీకి పాలు పోసిన రైతులకు లీటరుకు నాలుగు రూపాయల చొప్పున ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా విజయ పాలు, పాల ఉత్పత్తులను పెంచడానికి నూతనంగా పార్లర్ ను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు విజయ డెయిరీ కేంద్రాల్లో పాలు పోసి ప్రభు

29న యూటిఎఫ్ జిల్లా మహాసభలు

కొత్తగూడెం,నవంబర్26(ఆర్ఎన్ఎ): ఈ నెల 29న జరుగనున్న 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు. ఆరు సంవత్సరాలుగా ఉపాధ్యాయులు ప్రమోషన్లకు అర్హత ఉండి కూడా పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాల్వంచ మండల పరిధిలోని జగన్నాధపురంలో జిల్లా మహాసభలకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

ఖమ్మం,నవంబర్26(ఆర్ఎన్ఎ): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా టార్పాలిన్లు సిద్దంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు.

అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. దీంతో చెల్లింపులు త్వరగా జరగటానికి అవకాశం ఉంటుందన్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కఆదేశించారు. ధాన్యాన్ని వెంటనే కాం టాలు వేసి మిల్లులకు పంపాలన్నారు.

జిల్లావ్యాప్తంగా 164 కొనుగోలు కేంద్రాలు

గుంటూరు,నవంబర్26(ఆర్ఎన్ఎ): జిల్లావ్యాప్తంగా 164 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పౌరసరఫరాల జిల్లామేనేజర్ పి. జయంతి అన్నారు. ధాన్యం పండించిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో నమోదైతే అధికారులే కల్లాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేస్తారన్నారు. ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.1888, సాధారణ రకం క్వింటా రూ.1868, చొప్పున రైతుకు అందిస్తామన్నారు.

కొనుగోలు సమయంలో బ్యాంకు అకౌంట్, ఆధార్, ఈక్రాప్ నమోదు, మిగిలిన పత్రాలన్నీ సమర్పిస్తే ధాన్యం కొనుగోలు జరిగిన నాలుగైదు రోజుల్లో నగదు జమవుతుందని జయంతి వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరోవారం రోజుల్లో జిల్లా అంతటా ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే తెనాలి, వేమూరు, పిడుగురాళ్లలో కొనుగోలుకేంద్రాలను ప్రారంభించామన్నారు. మాచర్లతోపాటు మరోవారంలో జిల్లాలోని అన్ని ప్రధానకేంద్రాల్లో డీసీఎంఎస్, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తామని జయంతి వివరించారు.

దిగిరాని ఉల్లి ధరలు

హైదరాబాద్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): ఉల్లి కోయకుండానే కన్నీరు పెట్టిస్తున్నది. ఇటీవల పెరిగిన ధరలు అలాగే కొనసాగుతున్నాయి. ధరలు పెరిగే అవకాశం ఉండడంతో అటు సామాన్యులు ఇటు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల నుంచి ధరలు అమాంతంగా పెరగడం సామాన్య ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. రోజు రోజుకూ ధరలు ఆకాశాన్ని అంటుతుండగా ఉల్లి కోయక ముందే ధర వింటేనే కన్నీళ్లు తెప్పిస్తున్నది. ప్రస్తుత మార్కెట్‌లో ధర 70 నుంచి 80 మధ్యన కొనసాగుతోంది. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి మహారాష్ట్రతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో వెల్లుల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా డిమాండ్‌ను బట్టి మార్కెట్‌లో ఉల్లి దిగుమతి కాకపోవడంతో ఉల్లికి డిమాండ్ పెరిగింది. దీంతో అన్ని ప్రాంతాల్లో ఉల్లి ధర గణనీయంగా పెరిగింది. ధరల పెరుగుదలతో మార్కెట్‌లో వ్యాపారం తగ్గినట్లు చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు.

టిఆర్ఎస్ పార్టీకే రజకుల సంపూర్ణ మద్దతు

హైదరాబాద్, నవంబర్ 26 ః నిర్వీర్యం అవుతున్న కులవృత్తులను ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ గారికి మద్దతుగా జిహెచ్ఎంసి ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ రజక సంఘాల సమితి చైర్మన్ అక్కరాజ శ్రీనివాస్ , రాష్ట్ర కన్వీనర్ మానస గణేష్ తెలిపారు. 70 సంవత్సరాల తరబడి రజక వృత్తిదారుల యొక్క సమస్య అయినటువంటి లాండ్రీ ల నిర్వహణకు, దోబీ ఘాట్ ల నిర్వహణలకు ఉచిత విద్యుత్తు ప్రకటించిన సీఎం కేసీఆర్ గారికి రుణపడి ఉంటాము. రజకులను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ గరేనని అన్నారు. గతంలో రజకుల కోసం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న అందుకు తెలంగాణలోని రజకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రజకుల చిరకాల వాంఛ ఎస్సీ హోదా కేవలం కెసిఆర్ ద్వారానే సాధ్యం అవుతుందని దృఢంగా నమ్ముతున్నాం. కెసిఆర్ ద్వారానే రజకులకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నామని వారు అన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పంజగారీ ఆంజనేయులు, దురిశెట్టి చంద్రమౌళి, కుమారస్వామి, సుంకెత పోశెట్టి, సంగు స్వామి, కోట్ల శ్రీనివాస్, ఏళ్లంగారి పురుషోత్తం లు పాల్గొన్నారు.

రేడియో సిటీ సూపర్ సింగర్ 12వ సీజన్ ప్రారంభించిన రేడియో సిటీ

హైదరాబాద్, నవంబర్ 26 ః భారతదేశంలో సుప్రసిద్ధ రేడియో నెట్‌వర్క్ రేడియో సిటీ , భారతదేశపు ప్రతిభావంతులైన గాయకులను వెలుగులోనికి తీసుకువచ్చే తమ వారసత్వం ముందుకు తీసుకువెళ్తూ ఇప్పుడు రేడియోపై భారతదేశపు అతిపెద్ద సింగింగ్ టాలెంట్ హంట్ ? రేడియో సిటీ సూపర్ సింగర్ 12వ సీజన్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. సుప్రసిద్ధ సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే ఆయన స్వరపరిచిన 'ఎస్ఆర్ కళ్యాణమండపం' సంగీతాభిమానుల ప్రశంసలను అందుకుంది. త్వరలోనే ఆ చిత్రం విడుదల కానుంది. ఆయన హైదరాబాద్, వైజాగ్‌లలో పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించనున్నారు. రేడియో సిటీ సూపర్ సింగర్ ద్వారా, ఈ రేడియో ఛానెల్ ఔత్సాహిక గాయనీగాయకులకు తమ ప్రతిభను వెల్లడి చేసుకునేందుకు ఓ వేదికను దేశంలోని 39 నగరాలలో అందిస్తుంది. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రేడియో సిటీ ఇప్పుడు తమ రేడియో సిటీ సూపర్ సింగర్ 12వ సీజన్‌ను సోషల్ మీడియా, రేడియో ద్వారా నిర్వహించబోతుంది. ఈ పోటీలు 20 డిసెంబర్ 2020వ తేదీ ముగుస్తాయి.

ఈ పోటీలకు ఆడిషన్స్ 23 నవంబర్ 2020వ తేదీన ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఔత్సాహిక గాయనీగాయకులు తమ ఎంట్రీలను 06 డిసెంబర్ 2020వ తేదీ లోపుగా ఐఆర్‌వీఎస్, రేడియో సిటీ యొక్క మైక్రోసైట్ మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా పంపాల్సి ఉంటుంది. ఈ ఆడిషన్స్ తరువాత, ప్రతి భాషలోనూ ఐదుగురు పోటీదారులను వరుసగా హిందీ, తమిళం, తెలుగు మరియు కన్నడ భాషల నుంచి సుప్రసిద్ధ న్యాయనిర్ణేతలు కైలాష్ ఖేర్, స్వరకర్త జిబ్రాన్, సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ మరియు గాయకుడు ఆల్ ఓకే ఎంపిక చేయనున్నారు. ప్రతి రీజియన్‌నుంచి ఐదుగురు రేడియో సిటీ సూపర్ సింగర్ 12 టైటిల్ గెలుచుకోవడానికి పోటీపడతారు. హైదరాబాద్ మరియు వైజాగ్‌లో పోటీదారులను పబ్లిక్ ఓటింగ్ ద్వారా సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ ఎంచనున్నారు. రేడియో సిటీ సూపర్ సింగర్ 12వ ఎడిషన్ ప్రారంభం గురించి రేడియో సిటీ ? చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అషిత్ కుకియన్ మాట్లాడుతూ "ఈ కష్టకాలంలో ప్రజల నడుమ సంతోషం మరియు సానుకూలతను విస్తరించే లక్ష్యంతో, మేము మా ప్రతిష్టాత్మక కార్యక్రమం రేడియో సిటీ సూపర్ సింగర్ సీజన్2తో రావాలని నిర్ణయించుకున్నాం. రేడియో సిటీ ఎల్లప్పుడూ కూడా సంక్షోభ సమయంలో కూడా నగరం మరియు దాని ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అవకాశాలను అందించడాన్ని విశ్వసిస్తుంటుంది. ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే రేడియో సిటీ యొక్క అచంచలమైన నిబద్ధత గత 11 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం వృద్ధి చెందడంలో సహాయపడుతుంది.

నగర ప్రశాంతతను దెబ్బతీస్తున్న బిజెపి,మజ్లిస్

ప్రచారంలో విద్వేషాలు సృష్టిస్తే ఎలా ఓట్ల కోసం నగరాన్ని నరకం చేస్తారా రెండు పార్టీల ప్రచారంపై తలసాని మండిపాటు

హైదరాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): ప్రశాంతనగరాన్ని, అభివృద్ధి చెందిన నగరాన్ని ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. గ్రేటర్ ఎన్నికల్లో గెలుపు టిఆర్ఎస్‌దే అయినా ప్రచారంలో తాము ఎక్కడా విద్వేషాలకు తావివ్వకుండా ముందుకు సాగుతున్నామని అన్నారు. టిఆర్ఎస్‌కు చెందిన మంత్రులు, నేతలు ప్రజలను కలుస్తూ కేవలం నగరంలో చేసిన అభివృద్ధిని, చేపట్టిన పనులను మాత్రమే వివరించి ఓట్లు అడుగుతున్నామని అన్నారు. కానీ బిజెపి, ఐఎంఎంలు ప్రజలను రెచ్చగొట్టేలాగా ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి ఓట్లు దండుకోవాలన్న కారణంగా నగరంలో ప్రశాంతతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రం ఆరేండ్లుగా అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్నదని, ఇలాంటి సమయంలో అల్లర్లు, కొట్లాటలు జరిగితే తెలంగాణకే ప్రమాదం అన్నారు. గురువారం నాడాయన ఆర్ఎన్ఎ ప్రతినిధితో హైదరాబాద్ ఎన్నికలపై పిచ్చాపాటిగా మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో మళ్లీ కర్ఫ్యూలు, కల్లోలాలు మొదలైతే మొదట నష్టపోయేది ప్రజలేనని తెలిపారు. వారిపై ఆధారపడ్డ కుటుంబాలపైనా తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. బ్రాండ్ హైదరాబాద్‌కు అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపు మంటకలుస్తుందని అన్నారు. సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లు నగర అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కసారి వ్యతిరేకముద్ర పడితే మళ్లీ కోలుకోవడం కష్టమని చెప్పారు. ఓటువేసే సమయంలో వీటన్నింటినీ గుర్తుచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఏర్పడినప్పుడు అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని, మీకు పాలించడం చేతన పుతుందా? అని కొందరు అవమానించారని గుర్తుచేశారు. వాటన్నింటినీ పటాపంచలుచేస్తూ సిఎం కెసిఆర్ ఆరేండ్లుగా సుస్థిర, సమర్థమైన పాలన అందిస్తున్నామని చెప్పారు. 24గంటల కరెంట్, మంచినీటి సరఫరా, నగరంలో రోడ్ల నిర్మాణం, ఫ్లై ఓవర్లు నగర రూపురేకలను మార్చేశాయని అన్నారు. అయితే బిజెపి రంగప్రవేశంతో ప్రశాంత వాతావరణం చెడిపోయేలా ఉందన్నారు. దుబ్బాకలో బొటాబొటి మెజార్టీతో గెలవడంతో వారు పట్టపగ్గాలు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఏపీలో పవర్‌హాలిడే లతో వ్యాపారవేత్తలు విసిగిపోయారని, ఇందిరాపార్క్ వద్ద ధర్నాలు చేశారని మంత్రి గుర్తుచేశారు. కరెంటులేక ఉత్పత్తి ఆగిపోతున్నదని, టారిఫ్ పెంచి ఆయినా కరెంట్ ఇవ్వండంటూ ఎంత విజ్ఞప్తిచేసినా నాటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక సిఎం కెసిఆర్ 24 గంటల కరెంటుతోపాటు, సుస్థిర పాలన అందిస్తున్నారని చెప్పారు. నగరంలో అభివృద్ధిని కాంక్షించి ఎలాంటి పన్నులు, చార్జీలు పెంచలేదని, ఎవరిపైనా వివక్ష చూపలేదని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ మినిమం చార్జీలను ఆర్నెళ్ల కాలానికి మినహాయిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

హైదరాబాద్ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కెసిఆర్,కెటిఆర్‌లు అహర్నిశలు కష్టపడుతున్నారని అన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయం, సాగునీటిరంగంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిపెట్టారని, ఫలితంగా పంట ఉత్పత్తులు పెరిగాయని తలసాని చెప్పారు. ధరణి పోర్టల్‌తో పారిశ్రామికవేత్తలకు భూ లావాదేవీలు సులభం కానున్నాయని, పరిశ్రమల భూములకు భద్రత ఉంటుందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయి. హైదరాబాద్‌లో 5 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వ ఘనతే అన్నారు. నేరం జరిగితే గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నారు. సీఎం కేసీఆర్ మానస పుత్రిక 'షీటీమ్స్' అద్భుతంగా పనిచేస్తున్నాయన్నారు. ఫలితంగా నేరాలు తగ్గాయి. విద్వేషాలు, కల్లోలాలు లేవు.

కరోనా వల్ల తీవ్రంగా నష్టపోయిన వ్యాపారులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇలాంటి సమయంలో శాంతిభద్రతలు దెబ్బతింటే మరింత నష్టపోతారు. హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతింటుందన్నారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రచారం చేసుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదన్నారు.

గిరిజనుల్లో పౌష్టికాహార లోపం

పౌష్టికాహారం అందించేందకు కృషి తయారీలో గిరిజన యువతకు శిక్షణ

ఆదిలాబాద్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): ఏజెన్సీలో అత్యధికంగా పౌష్టికాహార లోపం, రక్తహీనతతో ప్రజలు బాధపడుతున్నారు. పాఠశాలలో చదువుకునే గిరిజన విద్యార్థులు రక్తహీనతతో అనారోగ్యానికి గురవుతున్నారు.

అందుకోసం విద్యార్థుల చదువుపై ప్రభావం పడకుండా ఉండేందుకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యంగా ఉండడానికి, రక్తహీనత ఏర్పకుండా ఉండడానికి దోహద పడుతుంది. పౌష్టికాహార తయారీ కేంద్రాల్లో ఏర్పాటుతో బలవర్ధకమైన ఆహారం అందించడమే కాకుండా తయారీ కేంద్రంలో పని కల్పించడం ద్వారా గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కలుగనున్నది. అందుకోసం ఐటీడీఏ ద్వారా ఏర్పాటుచేసిన యూత్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా గిరిజన యువతీ యువకులకు శిక్షణ అందించి జేఎల్‌జీ గ్రూప్ ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏజెన్సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, కిశోర బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు, పౌష్టికాహార లోపం గలవారికి అందించనున్నారు. గిరిజనులు ఈ పరిస్థితి అధిగమించడానికి వారికి మరింత ప్రోత్సాహం అందిస్తున్నది. గిరిజన సంక్షేమశాఖ ఆదేశాల మేరకు అధికారులు ఉమ్మడి జిల్లాలోని కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో, ఉట్నూర్‌లో పౌష్టికాహార కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. పౌష్టికాహారాన్ని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) ద్వారా ఆశ్రమ, గురుకుల పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయనున్నారు. ప్రైవేటు భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వం ద్వారానే అందించడం ద్వారా అవకతవకలు జరగకుండా నేరుగా పాఠశాలలు, వసతిగృహాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందనున్నది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రక్త నమూనాలు పరీక్షించినప్పుడు చాలా మందికి రక్తహీనత తక్కువగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఐటీడీఏ ప్రాంతంలో పౌష్టికాహార కేంద్రాలు తామే ఏర్పాటు చేసి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకొనున్నారు. అత్యంత పోషక విలువలు కలిగిన పౌష్టికాహార కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ నాణ్యత గల పల్లీలు, బెల్లంతో కూడిన పల్లిపట్టి తయారు చేయనున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కూడా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ జొన్నలు, కొర్రలు, పెసర, కందితో పాటు ఇతర ఆహార దినుసులతో కలిపి తక్షణమే వండి తినే విధంగా న్యూట్రి బాస్కెట్లను తయారు చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాతో పాటు భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఏటూరునాగారంలో న్యూట్రి బాస్కెట్, భద్రాచలంలో పల్లిపట్టి తయారు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తున్నది. పౌష్టికాహార కేంద్రాల్లో తయారుచేసిన సరుకుల్లో నాణ్యాతా ప్రమాణాలకు పెద్దపీట వేయనున్నారు. ప్రస్తుతం అందిస్తున్న సరుకులు ప్రైవేటు కంపెనీలు ద్వారా అందుతున్నాయి. వాటికి అధిక ధర ఉండడంతో పాటు నాణ్యత కూడా అంతంతగానే ఉండడం కారణంగా ప్రభుత్వం ద్వారానే నేరుగా పౌష్టికాహార కేంద్రాలు ఏర్పాటు చేసి నాణ్యతతో పాటు తక్కువ ధరకు అందించేందుకు చర్యలు చేపట్టారు.

దళారులదే మళ్లీ పెత్తనం

కొనుగోళ్ల పై వారిదే పైచేయి

నిజామాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు వచ్చిన అన్నదాతను అందరూ కలిసి నిలువునా ముంచుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని కాపాడుకున్న పంటను మార్కెట్‌కు తెస్తే తేమ సాకు, తాలు పేరుతో వ్యాపారులు అగ్గువ సగ్గువకు బేరమాడుతుండటంతో బేలచూపులు చూడటం అన్నదాత వంతవుతుంది. పత్తి,మక్కరైతులు గిట్టుబాటు లేక లబోదిబో మంటున్నారు. ఇప్పుడు మక్కల ధరలను తీసుకుంటే ఇదే విషయం అర్థం అవుతోంది. వివిధ మార్కెట్లలో ధరలు దారుణంగా పడిపోయాయి. రైతులు ఆందోళనకు దిగినా పలకరించే వారు లేరు. మక్కలకు ధర పలకడం లేదు. కొద్దిరోజులుగా వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం రాక పెరగడంతో ఇదే అదనుగా భావించిన వ్యాపారులు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్ని రోజుల నుంచి మార్కెట్‌కు మక్కలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఇదే అదనుగా దళారులు రంగప్రవేశంచేసి మద్దతు ధరలను మాయం చేశారు. ఈ క్రమంలో వ్యాపారులు ధర తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మద్దతు ధరను రైతులకు అందేలా చూడడంలో మార్కెట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దళారులకు కొందరు అధికారులు సహకరిస్తుండడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈఏడాది ధాన్యం కొనుగోళ్లు పెద్దఎత్తున ప్రారంభమైనా ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ లాంటి సంస్థ కొనుగోలు కేంద్రం జాడలేదు. ఒకవేళ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా తమకు పెద్దగా ఒరిగేది ఏమీలేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న అన్నదాతకు దళారుల బెడద ఎప్పుడూ ఉండనే ఉంటుంది. పంటలకు చీడపీడలలాగా వీరుకూడా రైతులను అంటిపెట్టుకునే ఉంటారు. వీరు ఎక్కడికి వెళితే అక్కడ వీరికన్నాముందే ప్రత్యక్షం అవుతారు. దీంతో వీరికి గిట్టుబాటు ధరలు ఎలాగూ రావు. కనీసం మద్దు ధరలు కూడా రాకుండా చేస్తారు. వీరు వ్యాపారులతో కుమ్మక్కయి రైతులను నిలువునా పీల్చేస్తుంటారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా వీరు లేకుండా మార్కెట్లు ఉండవు. వ్యాపారులు ఉండరు. దీంతో రైతులు ఇదంతా తమ ఖర్మగా భావించి అటుతిరిగి ఇటుతిరిగి వారివద్దకే వెళ్లాల్సిన దుస్తితి ఏర్పడుతోంది. దళారుల కారణంగానే రైతులు తము పండించన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడం లేదు. ఇకపోతే ప్రభుత్వం ప్రకటించిన విధంగా మార్కెట్లు ఉండవు. ధరలు పేరుకే ఉంటాయి. సీజన్ ప్రారంభంలో ఆశించిన రీతిలో లభించినా కొద్ది రోజుల్లోనే తగ్గుముఖం పట్టేలా చేస్తారు. కారణం పంటబాగా వచ్చిందనో లేదా, మార్కెట్‌లో ఆదరణ లేదనో ప్రచారం చేస్తారు. తీసుకుని వచ్చిన ధాన్యం అయినకాడికి అమ్ముకునేలా చేస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు పంటలు నష్టపోగా వచ్చిన కొద్దిపాటి దిగుబడిని మార్కెట్‌కు తెస్తే మద్దతు ధరలు లభించకపోవడం వారిని కృంగదీస్తోంది. తేమ, మట్టి పేర సాకులు చెబుతూ గిట్టుబాటు ధర ఇవ్వడంలేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాసంగి పంటలకు సిద్ధమవుతున్న రైతులు

వాణిజ్య పంటలకు ప్రోత్సాహం

ఆదిలాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. యాసంగిలో ప్రధానంగా శనగ, గోధుమ, వేరు శనగ, జొన్న పంటలను సాగుచేస్తున్నారు. దీంతో రైతులు రెండు పంటలను పండించుకునే అవకాశం లభిస్తుంది. వేలాది మంది రైతులు రెండేళ్లగా ప్రాజెక్టుల కింద వానాకాలం, యాసంగి పంటలను సాగుచేస్తున్నారు.

ఈ సంవత్సరం వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా కురిసిన వానలతో ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. సాగునీటి ప్రాజెక్టులు తక్కువగా ఉండడంతో రైతులు వానాకాలం పంటలను ఎక్కువగా పండిస్తారు. జిల్లాలో సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టులు ఉండగా. జిల్లాలో యాసంగిలో రైతులు ప్రధానంగా శనగ, గోధుమ, వేరుశనగ, జొన్న పంటలను సాగుచేస్తారు.

ఈ ఏడాది యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 24 వేల హెక్టార్లలో పంటలు సాగువుతాయని అధికారులు అంచనా వేశారు. రెండు ప్రాజెక్టుల్లో నీటిమట్టం ఎక్కువగా ఉండడంతో ఈ ఏడాది రైతులు యాసంగి పంటలను సాగుచేసే అవకాశం లభించింది.

ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో యాసంగి పంటలను సాగు చేసే రైతులకు భరోసా ఏర్పడింది. ప్రభుత్వం ప్రాజెక్టుల పునరుద్ధరణకు భారీగా నిధులు కేటాయించడంతో జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన సాత్నాల, మత్తడి చివరి

ఆయకట్టు భూములకు సాగు నీరు అందనుంది. సాత్నాల ప్రాజెక్టు కుడి కాలువ కింద జైనథ్ మండలంలోని 15 గ్రామాల రైతులకు చెందిన భూములకు సాగునీరు అందుతుంది.

ఇదిలావుంటే జిల్లాలో అత్యధికంగా 1.35లక్షల హెక్టార్ల లో సాగు చేస్తుండడంతో మిగితా పంటలు అంతంత మాత్రంగానే సాగుచేస్తారు. అయి తే పత్తిపైనే ఎక్కువగా ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు ఎక్కువగా ఉండడంతో పత్తి కూలీల రేట్లు అమాంతం పెంచేస్తున్నారు. మార్కెట్‌లో మద్దతు ధర లేకపోయినా చేసిన కష్టం నేల పాలు కాకుండా, చేసినా అప్పులు తీర్చాలంటే కూలీల భారం మోయక రైతులకు తప్పడం లేదు. కూలీలు వేలం పాటలతో అధిక ధరలు చెల్లించే వారికి వెళ్లి పోవడంతో తక్కువ ధర చెల్లించే రైతులు కూలీల కోసం వెతుకక తప్పడంలేదు. గత్యంత రం లేక కుటుంబ సభ్యులతో కలిసి తన పొలంలో పత్తిని తీసే పరిస్థితులు కూడా తప్పడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఓ వైపు జిల్లాలో పత్తి రైతుకు మద్దతు ధర లేక లబోదిబో మంటుంటే మరోవైపు పత్తి తీతకు డిమాండ్ పెరిగి పోతుంది. ఒక్కసారిగా రైతు లకు కూలీల కొరత ఏర్పడుతోంది. లక్షల రూ పాయల పెట్టుబడి పెట్టి పంటను పండించి న రైతులకు రోజుకు రూ. 300 ఇస్తామన్న కూలీలు దొరికే పరిస్థితి కనిపించడం లేదు.

పండ్ల తోటలకు ప్రోత్సాహం

ఆర్థికంగా రైతుల అభివృద్ధికి కృషి

చిత్తూరు,నవంబర్26(ఆర్ఎన్ఎ): సిఎం జగన్ రాష్ట్రాన్ని వ్యవసాయకంగా అభివృద్ధి చేసి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయనున్నారని మంత్రి నారాయణ స్వామి అన్నారు. రాయలసీమను పండ్ల తోటల హబ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి చేస్తున్న నూతన విజ్ఞాన ఆవిష్కరణలు తెలుసుకొని ఎంపీఈవోలు క్షేత్రస్థాయిలో అమలు చేసి రైతులకు అండగా ఉండాలన్నారు. ఎంపీఈవోలు రైతులను కలిసి పంటల సాగు, ఉత్పత్తులు మార్కెటింగ్ వంటి వాటిపై తెలుసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఇక్కడ రైతులు పండించే పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. పండ్ల తోటల పెంపకం పెద్దఎత్తున చేపట్టాలన్నారు. డ్రిప్ ద్వారా భూగర్భ జలాలు పొదుపుగా వాడుకొని పంటలు సాగు చేయాలన్నారు. పండ్ల తోటల సాగులో రాయలసీమ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. హెచ్చెల్సీ కింద ఉన్న భూములు సారవంతం కోల్పోయి నిస్సారంగా తయారవుతున్నాయనీ.. ఆయకట్టు భూముల్లో మళ్లీ మంచి పంటలు పండేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది వేరుసెనగ దిగుబడి బాగా వచ్చినా.. బహిరంగ మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందిగా మారిందన్నారు. రైతులు ఉత్పత్తులను బయట తక్కువ ధరలకు విక్రయించవద్దనీ అన్నారు. వ్యవసాయం, పండ్ల తోటల పెంపకంలో ఆదర్శంగా నిలవాలన్నారు.

జోగు ఫౌండేషన్ ద్వారా విద్యకు కృషి

ఆదిలాబాద్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): జోగు ఫౌండేషన్ తరపున విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ బుక్స్ పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురుకులాల్లో కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తూ, ఒక్కో విద్యార్థిపై రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇంగ

కొనుగోలు కేంద్రాల్లోనే పంటలు అమ్ముకోవాలి

గిట్టుబాటు ధరలు ఇస్తున్నది ఇక్కడే: ఎమ్మెల్యే

కరీంనగర్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. రైతులకు సకాలంలో సరైన ధరలు లభించేలా చర్యలు తీసుకున్నారని, ఇందుకు సిఎం కెసిఆర్ అభినందనీయుడని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మాత్రమే గిట్టుబాటు ధరలు దక్కేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయిస్తే త్వరితగతిన బ్యాంకు ఖాతాలో డబ్బులను జమ చేస్తున్నామన్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంటలను దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కోనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే సూచించారు.దళారుల బెడద లేకుండా గిట్టుబాటు ధరల కోసం ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు అనుబంధ సంస్థల ఏర్పాటు ఆలోచన చేస్తుందన్నారు. త్వరలోనే అది కార్యరూపం దాల్చనుందని అన్నారు. వీటి ఏర్పాటు ద్వారా రైతులు తమ ధాన్యం ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకునే అవకాశం ఉంటుం దని తెలిపారు. ప్రాజెక్టులతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారిన దృష్ట్యా పండించిన పంటలు ప్రకృతి విపత్తుల బారిన పడకుండా ఉండడం కోసం నవంబరు, మార్చి నెలల్లోనే పంటలకు నీటిని విడుదల చేసి ముందుగా పంటల సాగు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దీని ద్వారా వర్షాలు పడకపోయినా ఎల్లంపెల్లి, మేడిగడ్డ, అన్నారం,సుందిల్ల ప్రాజెక్టుల నీటిని విడుదల చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆయా సీజన్‌లో సంభవించే ప్రకృతి విపత్తుల బారిన పడకుండా, రాళ్ల వర్షాల నుంచి పంటలను కాపాడు కోవచ్చునన్నారు.

నీటిని లిఫ్ట్ చేయడంపై అనుమానాలను పటాపంచాలు చేస్తూ గోదావరి నీరు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్గొండ,ఖమ్మం జిల్లాలకు తరలుతున్నాయని తెలిపారు.

నిన్ను ఎంపీగా గెలిపించిన

కరీంనగర్ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయి

-బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు.. వైషమ్యాలు..ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోంది

-వీళ్ల తెలంగాణను శాంతి యుతంగా ఉంచేటోళ్లు..ఎంఐఎం పేరెత్తే అర్హత..స్థాయి లేదు మీకు

-జనరల్ స్థానంలో మేయర్ పీఠంపై దళితున్ని కూర్చోబెట్టిన చరిత్ర ఎంఐఎం పార్టీది

-ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తీవ్ర వ్యాఖ్యలు

కరీంనగర్, నవంబర్ 26(నేటినిజం ప్రతినిధి): నీ తండ్రి డి. శ్రీనివాస్ పీసీసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎంఐఎం ముందు తలవంచి మోకరిల్లిన ఘటన నీకు గుర్తుకు రాలేదా లేక నిద్రమత్తులో మర్చిపోయావా అంటూ నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ను..లాక్డౌన్ సమయంలో.. గెలిచినప్పటి నుండి ఇప్పటి వరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజలకు కోడిగుడ్డు.. కొత్తిమీర ఇవ్వనోడు హైదరాబాద్ ప్రజలకు కార్లు.. బైకులు కొనిస్తాడా అని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ను వీళ్లు ఇద్దరు కూట్లే రాయి తీయనోడు ఏట్లో రాయి తీసే విధంగా ఉందంటూ.. కరీంనగర్ ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం హైదరాబాద్ లోని నాంపల్లి నియోజకవర్గంలో ఎంఐఎం శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మీరాజ్ తో కలిసి అహ్మద్ హుస్సేన్ తన టీమ్ తో కలిసి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పతంగి గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో కార్పొరేటర్లను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈసందర్భంగా అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ2004 అసెంబ్లీ ఎన్నికల్లో సహకారం అందించాలని ఎంఐఎం అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ వద్దకు నీ తండ్రి డి.శ్రీనివాస్.. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ తో కలిసి వచ్చిన ఘటన గుర్తు తెచుకోవాలన్నారు. నేడు యావత్తు దేశం అసదుద్దీన్ ఒవైసీ నాయకత్వాన్ని కోరుకుంటున్నదన్నారు. దేశానికి అసదుద్దీన్ ఒవైసీ లాంటి సెక్యులర్ నేత నాయకత్వం అవసరమని..బుద్ధి హీనులైన మాట్లాడుతున్న మీలాంటి అసమర్థుల అవసరం లేదన్నారు. నిజామాబాద్ రైతులకు గెలిచాక 100 రోజుల్లో పసుపు బోర్డు తీసుకువస్తానని బాండ్ పేపర్ పై రాసిచ్చి ఇప్పటి వరకు పసుపు బోర్డు జాడలేదని ఇది రైతులను మోసం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడవిట్ లో దొంగ డిగ్రీ సర్టిఫికెట్ పెట్టి దేశ రాజ్యాంగాన్ని అవమాన పర్చి..ప్రజలను మోసం చేసిన అర్వింద్ తమ నేతల కాలి గోటికి సరిపోలేడనే విషయం గుర్తెరుగాలన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలిచాక బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈద్గా ను తొలగిస్తానని చెప్పి కనీసం గోడ ముట్టుకోలేదని ఎద్దేవా చేశారు. లాక్డౌన్ వేళ కరీంనగర్ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే బండి సంజయ్ ఎంపీగా ఉండి పేదలకు ఏమి చేయలేదని ఇంట గెలిచి రచ్చ గెలవాలని సంజయ్ కి హితువు పలికారు. కరీంనగర్ అభివృద్ధిని పరుగులు పెట్టించండంపై ఎంపీగా సంజయ్ సర్జికల్ స్ట్రైక్ చేయాలి కానీ పాతబస్తీ ప్రజలపై కాదని, సంజయ్ ఎంపీగా ఘెరంగా విపలమైనప్పుడు హైదరాబాద్ లో ఎలా సక్సెస్ అవుతాడని విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధి పై నీకు ఏపాటి చిత్తశుద్ధి ఉందొ..నువ్వు గెలిచి దాదాపు రెండేళ్ళు కావస్తున్నా ఏం అభివృద్ధి చేశావో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేశం కోసం.. ధర్మం కోసం అంటూనే యువతను పెడదారి పట్టిస్తు.. వారిపై మొసలి కన్నీరు కారుస్తూ.. హార్ట్ ఎటాక్ గుండె నొప్పి డ్రామా ఆడిన చరిత్ర నీది నువ్వా ఎంఐఎం ను విమర్శించేది అని విమర్శించారు. నువ్వు ఎంపీగా పోటీచేసినప్పుడు ఉన్న యూత్ ఫాలోయింగ్ ఇప్పుడు ఎందుకు లేదని ప్రశ్నించారు. బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు.. విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు ప్రసంగాలు చేస్తూ హిందువులను మోసం చేస్తుందన్నారు. హిందువులను ఓటుబ్యాంకు కోసం దేశం కోసం ధర్మం కోసం అంటూ బీజేపీ నేతలు గద్దెనెక్కి రాజకీయ వబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. దేశ చరిత్రలో హైదరాబాద్ మేయర్ పీఠంపై జనరల్ స్థానంలో దళితున్ని ఎంఐఎం పార్టీ మేయర్ చేసిన విషయం ప్రజలు ఎప్పటికి మర్చిపోరన్నారు. దేశంలో సెక్యులరిజాన్ని బలపర్చలనే ఉద్దేశ్యంతో తమనేత అసదుద్దీన్ ఒవైసీ దళితులు, బీసీలకు చట్ట సభల్లో టికెట్లు ఇచ్చారన్నారు. ఎంఐఎం జోలికొస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. దారుస్సలాం కూల్చడం కాదు కదా గోడను కూడా ముట్టుకోలేవన్నారు. సంజయ్, అర్వింద్ లకు దమ్ముంటే ఎంపీలుగా రాజీనామాలు చేసి తిరిగి ప్రజా క్షేత్రం లోకి వెళ్లి.. గెలిచి మీ దమ్మును నిరూపించు కోవాలని సవాల్ విసిరారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, కార్పొరేటర్లు బర్కత్ అలీ, అఖీల్ ఫిరోజ్, ఆతిన, శర్ఫుద్దీన్, అలిబాబా, అజహర్ దబీర్, నాయకులు యునూస్ నదీమ్, మస్రత్, సాబీర్, రజియుద్దీన్, అఖీల్, ఇమ్రాన్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల సవరణ వెంటనే నిలుపుదల చేయాలి

కార్మికుల సార్వత్రిక సమ్మె లో పాల్గొన్న టీయూడబ్ల్యూజే హెచ్ వన్ ఫోర్ త్రీ

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 26 (నేటినిజం ప్రతినిధి):కేంద్ర ప్రభుత్వం ఇటీవలే కార్మిక చట్టాల సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది .కార్మిక చట్టాల సవరణ తో కార్మికులకు కార్మికుల కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని కార్మిక చట్టాల సవరణ వెంటనే నిలుపుదల చేయాలంటూ కార్మికులు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా వేములవాడ సీఐటీయూ, ఏ ఐ టి యు సి సంఘాల నాయకులు కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టి రాస్తారోకో నిర్వహించారు.

కార్మికుల సార్వత్రిక సమ్మె కు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా సంఘీభావం ప్రకటించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులందరికీ ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు గుర్రం అశోక్ కడారి రాములు రమేష్ అశోక్ శ్రీనివాస్ మల్లేశం ఎల్లయ్య లతోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి

సిద్దిపేటను అగ్రగామిగా నిలిపేందుకు కృషి

సిద్దిపేట,నవంబరు 26(ఆర్ఎన్ఎ): రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలకనుగుణంగా జిల్లాలోని మున్సిపాలిటీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిస్థాయిలో నిషేధం కోసం యత్నిస్తున్నామని అధికారులు అన్నా రు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ ప్రణాళికా బద్ధంగా పనిచేయాలనిస్పష్టం చేశారు. ఇటీ వల జరిగిన సమావేశంలో ఆయా మున్సి పాలిటీల్లో డిసెంబర్ చివరి నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత పట్టణాలుగా మార్చాలన్నారు. సిద్దిపేట మున్సిపల్ అభివృద్ధిలో రోల్ మోడల్‌గా ఉందన్నారు. అన్ని మున్సిఎ లిటీల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని అన్నా రు.

ఇదే సమయంలో ఆయా మున్సిపా లిటీలు డిసెంబర్ తరువాత ప్లాస్టిక్‌ను పట్టణంలో నిషేధించినట్లు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధంపై థార్డ్ పార్టీ ద్వారా విచారణ జరిపించి అవార్డులు ఇస్తామని తెలిపారు. మున్సిపాలిటీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్లలో అధికారులు లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలన్నారు. సిద్దిపేట మున్సిపల్‌లో ప్రస్తుతం 60శాతం వసూల్లు జరిగాయని, నిర్ధేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మున్సిపాలిటీల్లో అక్రమ లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) పథకాన్ని నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా దరఖాస్తులను స్వీకరించి క్రమబద్ధీకరణ పక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో తడి, పొడి చెత్త సేకరణ విషయంలో ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత గూర్చి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

మక్క రైతులకు భరోసా ఏదీ?

జనగామ,నవంబర్26(ఆర్ఎన్ఎ): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదని పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని సిపిఎం దుయ్యబట్టింది. పంటలకు గిట్టుబాటు దరలు వస్తున్నాయో లేదో జనగామ మార్కెట్‌కు వస్తే రైతుల అవస్థలు తెలుస్తాయని సిపిఎం జిల్లా నాయకుడు జిల్లెల సిద్దారెడ్డి అన్నారు. రైతులు మార్కెట్లలో పడిగాపులు పడుతున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదన్నారు. మొక్కజొన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మార్కెట్లో వ్యాపారులు, అధికారులు రైతులకు సహకరిస్తున్నారా? లేదా? అనే వివరాలు రైతుల నుంచి సేకరించారు. రైతులకు వేలు జరుగుతుందనే సదాశయంతో కేంద్రం నామ్‌ను ప్రవేశపెడితే అమలులో రాష్ట్ర సర్కారు అడుగడుగున తూట్లు పొడుస్తూ నామ్‌ను నామమాత్రంగా మార్చిందని ఆరోపించారు. గత వారంతో పోల్చితే మొక్కజొన్న ధర భారీగా తగ్గినప్పటికీ, రైతులకు భరోసా కల్పించేవారే కరవయ్యారన్నారు. ప్రభుత్వం చెబుతున్న తీరు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు

ప్రచారంలో మేడ్చెల్ నేతలు బిజీ

మేడ్చల్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ నేతలు గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడుపుతున్నారు. నగర పరిధిలోనే జిల్లా ఉండడంతో ఇక్కడి నేతలు ప్రచారంలో ఉన్నారు. కొద్ది రోజులే సమయం ఉండటంతో మేడ్చల్ నియోజకవర్గ శివారులోని గ్రేటర్ ప్రాంతాల్లో మేడ్చల్ టీఆర్ఎస్ నేతలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.శామీర్‌పేట మండల టీఆర్ఎస్ నాయకులు కుత్బుల్లాపూర్ గిరినగర్ 127వ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయ శేఖర్‌గౌడ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. శామీర్‌పేట మండల ఎంపీపీ ఎల్లూబాయ్, జెడ్పీటీసీ అనితలాలయ్యలతో పాటు టీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

పాకిస్థాన్ టెర్రరిజం ప్రపంచం దృష్టికి..

క్రాస్ బోర్డర్ ఉగ్రవాద కార్యకలాపాలపై ఉక్కుపాదం

ప్రపంచ దేశాలు దృష్టి సారించేలా చేస్తాం

విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్

న్యూఢిల్లీ,నవంబరు 26(ఆర్ఎన్ఎ): క్రాస్ బోర్డర్ టెర్రరిజంలో పాకిస్థాన్ పాత్రపై ప్రపంచం దృష్టి సారించేలా భారత దేశం కృషి చేస్తుందని విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్ చెప్పారు. ముంబై ఉగ్రవాద దాడులు జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జై శంకర్ ట్విటర్ వేదికగా పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ప్రస్తుతం ఆయన బహ్రెయిన్, సీషెల్స్, యూఏఈ దేశాల్లో పర్యటిస్తున్నారు.

2008 నవంబరు 26న ముంబైపై జరిగిన ఉగ్రవాద దాడిలో 10 మంది పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తొయిబా ఉగ్రవాదులు పాల్గొన్నారు. వీరు తాజ్ హోటల్, ఒబెరాయ్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, నారిమన్ హౌస్, ఛత్రపతి శివాజీ టెర్మినస్ ట్రైన్ స్టేషన్‌లపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోగా, వందల మంది గాయపడ్డారు. 9 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. అజ్మల్ అమిర్ కసబ్ అనే ఉగ్రవాదిని ప్రాణాలతో పట్టుకున్నారు. కసబ్‌కు ఉరి శిక్ష విధించడంతో పుణేలోని యెరవాడ కేంద్ర కారాగారంలో 2012 నవంబరు 11న ఉరి తీశారు.

ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయి నవారిలో ఆరుగురు అమెరికన్లు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సౌత్ అండ్ సెంట్రల్ ఆసియన్ అఫైర్స్ బ్యూరో ఓ ట్వీట్‌లో స్పందిస్తూ, ముంబైలో జరిగిన నరమేధానికి కారకులను చట్టపరంగా శిక్షించడానికి కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించింది. ఆరుగురు అమెరికన్లతోపాటు బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపింది.

భారత దేశానికి వ్యతిరేకంగా జరుగుతున్న క్రాస్ బోర్డర్ ఉగ్రవాద కార్యకలాపాలపై ప్రపంచ దేశాలు దృష్టి సారించేలా చేస్తామని జై శంకర్ ట్వీట్ చేశారు. "భారత దేశానికి వ్యతిరేకంగా పీడగా మారిన క్రాస్ బోర్డర్ టెర్రరిజంపైనా, అంతర్జాతీయ ఉగ్రవాద కేంద్రంపైనా ప్రపంచం దృష్టి పడేలా చేస్తాం" అని పేర్కొన్నారు. అయితే ఆయన పాకిస్థాన్ పేరును ప్రస్తావించ లేదు. పాకిస్థాన్‌ను ఉద్దేశించి భారత దేశ అధికారులు, నేతలు మాట్లాడేటపుడు ఉగ్రవాద కేంద్రం అని పేర్కొంటారన్న సంగతి తెలిసిందే.

చిత్తూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు

పొంగుతున్న వాగులు,వంకలు

చిత్తూరు,నవంబర్26(ఆర్ఎన్ఎ): భారీగా కురుస్తున్న వర్షాలకు ఎస్ఆర్ పురం మండలం పాత పాల్యం, పాపిరెడ్డి పల్లి వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎనిమిది గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాల సముద్రం మండలం కావేరి రాజపురం, పాల సముద్రం గ్రామాల్లో వర్షానికి వరిపంట నేలమట్టమైంది. ఎస్ఆర్ పురం మండలం రాఘవ రాజపురం వంక ఉద్రిక్తంగా ప్రవహించడంతో గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెదురుకుప్పం మండలం పచ్చికాపలం పరిధిలో టీటీడీ కళ్యాణ మండపం వద్ద గాలివానకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేటమట్టమయ్యాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి తిరుమల శ్రీవారి ఆలయంలోకి వర్షపు నీరు చేరాయి. దీంతో సిబ్బంది మోటార్ల సహాయంతో నీటిని బయటకు పంపుతున్నారు. బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ప్రహారీ గోడ కూలగా, బైక్‌లు ధ్వంసం అయ్యాయి. ఈ తుపాను ప్రభావంతో చిత్తూరు, కర్నూలు, ప్రకాశం, వైఎస్ఆర్ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. మిగిలిన చోట్ల అక్కడక్కడ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడ్డాయి. దీంతో నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మోహరించాయి. అన్ని విభాగాలను ఏపీ ప్రభుత్వం అప్రమత్తం చేసింది. జిల్లాలో 'నివర్' తుపాను కారణంగా నెల్లూరు, తడ, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, వాకాడు, కోట, మనుబోలు, ముత్తుకూరు, కావలిలో కుంభవృష్టి వర్షం పడుతోంది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.దీంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అదేవిధంగా ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లాలోని 1600 చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి.చెరువులకు గండ్లు పడకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. సోమశిల, కండలేరు నుంచి భారీగా సముద్రంలోకి నీటి విడుదల చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల్లో పోలీసులు గస్తీ కాస్తున్నారు. నెల్లూరు జిల్లాల్లో 100 తుపాను సెంటర్లు ఏర్పాటు చేశారు. తుపాను సహాయక చర్యల్లో 5వేల మంది సిబ్బంది పాల్గొన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నెంబర్ - 1077 ఏర్పాటు చేశారు.

తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి కడప జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్, కడప, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయాలతోపాటు, జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు చేశారు. తుపాన్ నేపథ్యంలో రేణిగుంటలో బాలాజీ కాలనీ నీటమునిగింది. తిరుపతిలో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. ఏర్పేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయి. దీంతో అరినియర్, మ్లలెమడుగు ప్రాజెక్టుల గేట్లను అధికారులు ఎత్తివేత వేశారు. పలు జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ భరత్ గుప్తా అధికారులను అప్రమత్తం చేశారు. అదేవిధంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

జగన్ సర్కార్ సుప్రీంలో భారీ ఊరట

హైకోర్టు గాగ్ ఆర్డర్‌పై సుప్రీం స్టే

అమరావతి భూముల కేసుపై సుప్రీం కీలక ఆదేశాలు

అమరావతి,నవంబర్26(ఆర్ఎన్ఎ): సుప్రీం కోర్టులో జగన్ సర్కార్ కు భారీ ఊరట లభించింది. మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన గ్యాగ్ ఆర్డర్ పై అత్యున్నత న్యాయస్థానం స్టే ఇవ్వడం ఏపీ రాజకీయాల్లో సంచలనమైంది.. అమరావతిలో జరిగిన భూ కుంభకోణానికి సంబంధించి రాష్ట్ర అవినీతి నిరోధక బ్యూరో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లోని విషయాలను మీడియాకు ఇవ్వకుండా పరిమితం చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన గాగ్ ఆర్డర్ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు బుధవారం స్టే ఇచ్చింది. ఇదిప్పుడు సంచలనంగా మారింది. ఈ పరిణామంతో సుప్రీం కోర్టులో జగన్ సర్కార్ కు భారీ ఊరట లభించింది. మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన గ్యాగ్ ఆర్డర్ పై అత్యున్నత న్యాయస్థానం స్టే ఇవ్వడంతో ఏపీలోని జగన్ సర్కార్ వాదనకు బలం చేకూర్చినట్లు అయ్యింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన గాగ్ ఆర్డర్ ను సవాలు చేస్తూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక సెలవు పిటిషన్ ను సుప్రీంకోర్టు దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ అశోక్ భూషణ్, ఆర్ సుభాష్ రెడ్డి, ఎం ఆర్ షాలతో కూడిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. వాదనలు విన్న సుప్రీం కోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. అశోక్ భూషణ్ నేతత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేసి.. తదుపరి విచారణ జనవరి చివరి వారానికి వాయిదా వేసింది. అప్పటి దాకా ఈ కేసును ఫైనల్ డిసైడ్ చేయొద్దని హైకోర్టును ఆదేశించింది. జగన్ సర్కార్ తరపున సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్ వాదనలు వినిపించారు. తనపై చర్యలు తీసుకోవద్దని దమ్మాలపాటి కోర్టును ఆశ్రయిస్తే 13 మందికి వర్తింపచేశారని.. పిటిషనర్ అడగకుండానే ఇలాంటి ఆదేశాలు ఎలా పాస్ చేస్తారని వాదించారు. అమరావతిలో మేజర్ స్కాం జరిగిందని.. దీనిపై దర్యాప్తు జరగాలని కోరారు. బినామీల ద్వారా భూములు కొనుగోలు చేశారన్నారు. అమరావతిలో భూ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సిట్ పై హైకోర్టు స్టే విధించిందన్నారు.. దీంతో సీబీఐ ద్వారా దర్యాప్తు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని కోర్టుకు తెలిపారు. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయొద్దా.. అడ్వకేట్ జనరల్‌గా పని చేసినంత మాత్రాన ప్రతీకారం పేరుతో దర్యాప్తు జరగొద్దని అంటారా.. దర్యాప్తు వద్దు, మీడియా రిపోర్టింగ్ వద్దు, ఏది జరగకూడదా అని రాజీవ్ సూటిగా ప్రశ్నించారు. అమరావతి భూకుంభకోణంపై దర్యాప్తు చేస్తే ఇబ్బంది ఏంటని రాజీవ్ ప్రశ్నించారు. మధ్యంతర ఆదేశాలు ఎలా ఇస్తారని.. మీడియాపై గ్యాగ్ ఆర్డర్ ఇవ్వడం సరికాదన్నారు. సహారా కేసులో మీడియాపై గ్యాగ్ ఆర్డర్ విషయంలో నిర్దిష్ట సూత్రాలు ఉన్నాయని.. ఎఫ్ఐఆర్ అనేది పబ్లిక్ డాక్యుమెంట్.. రాజకీయ దురుద్దేశంతో సీఎంకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పొలిటికల్ లిటిగేషన్ వేస్తున్నారన్నారని రాజీవ్ వాదించారు. ఇటు మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి తరపున సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. గత ప్రభుత్వంలో శ్రీనివాస్ ఏజీగా పని చేశారని.. అందుకే టార్గెట్ చేశారన్నారు. రాజధాని అనేది రహస్యం కాదు, అది అందరికీ తెలుసు.. రాజధానిలో భూములు కొనవద్దని ఎలా అంటారని ప్రశ్నించారు. హైకోర్టుకు వెళ్లి ఆర్డర్ వేకెట్ చేయమని అడగాలని సూచించారు.

మర్మమేమిటి?

గ్రేటర్ ప్రచారానికి బీజేపీ అగ్రనేతలు ఎందుకు?

తెలంగాణపై పట్టుకు బీజేపీ తహతహా!!

జీహెచ్ఎంసీ ఎన్నికలను సీరియస్ గా తీసుకున్న అధినాయకత్వం

హైదరాబాద్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ మహానగరంలో ఇప్పుడు జరుగుతున్నది స్థానిక ఎన్నికలు. అలాంటి లోకల్ ఎలక్షన్లకు కేంద్రంలో కొలువు తీరిన అధికారపార్టీకి చెందిన జాతీయ నేత పని కట్టుకొని రావటం ఏమిటి? ప్రధానమంత్రి మోదీకి అత్యంత సన్నిహితుడిగా..ఆయన నీడగా చెప్పే అమిత్ షా లాంటి అగ్రనేత.. స్థానిక ఎన్నికల ప్రచారానికి రావాల్సిన అవసరం ఏమిటి? అదొక్కటేనా? బీజేపీకి చెందిన అగ్రనేతలు.. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రితో సహా కేంద్రమంత్రులు అదే పనిగా రావటంలో మర్మమేమిటి? అన్నది మరో ప్రశ్న. ఇదే విషయాన్ని తనకు అనుకూలమైన వాదనను వినిపిస్తోంది టీఆర్ఎస్. వరదలొచ్చి ప్రజలు కష్టంలో ఉన్నప్పుడు కనిపించని నేతలు ఇప్పుడు మాత్రం.. పోలోమని వచ్చేస్తున్నారంటూ మంత్రి కేటీఆర్.. హరీశ్ మొదలుకొని టీఆర్ఎస్ నేతలంతా విమర్శలు చేస్తున్నారు. వ